# మన జనప్రగతి

తెలుగు దినపత్రిక

నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం

సంపుటి : 6 సంచిక : 158 పేజీలు : 8 వెల : రూ.2/- శనివారం 04 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా

# మారుస్తా...

### - 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

● జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం ● సున్నపురల్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మాణం ● సీమలో పారాల్సింది రక్తం కాదు..నీళ్లు ● మావిగన్, విజయవాడ..రేపు మరేంటో..? ● జగన్ తీరుపై పరోక్షంగా విమర్శలు ● సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి






**జమ్మలమడుగు,మన జనప్రగతి జులై 03:** ఆంధ్రప్రదేశ్‌ను సరికొత్త పారిశ్రామిక హబ్‌గా, ముఖ్యంగా 'స్టీల్ స్టేట్'గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కడప జిల్లాలోని జమ్మలమడుగు మండలం సున్నపురళ్లపల్లెలో రూ.16,350 కోట్లతో నిర్మించనున్న ప్రతిష్టాత్మక జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత విజయ నగరం జిల్లాలోని జిందాల్ పారిశ్రామిక పార్కును వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. రాయలసీమకు స్వర్ణయుగం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోనే మొదటిసారిగా గ్రీన్ స్టీల్‌ను మిగతా2లో...

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

● యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి

● యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 03:** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా మిగతా2లో...

## ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

- శంగవరపుకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు
- రాష్ట్ర అభివృద్ధికి కీలకం అన్న హోంమంత్రి అనిత



**విజయనగరం,మన జనప్రగతి జులై 03:** ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. శుక్రవారం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి

మిగతా2లో...

## అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

- హెచ్చరించిన వాతావరణ శాఖ



**విశాఖపట్టణం,మన జనప్రగతి జులై 03:** ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మిగతా2లో...

## లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం

- పదేళ్ల నిర్వహణకు 4,500 కోట్లతో టెండర్లు.
- శాశ్వత సాగునీటి భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.



**జగ్గయ్యపేట, మన జనప్రగతి జులై 03:** రాష్ట్రంలో లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకువచ్చి 8.2 లక్షల ఎకరాలకు శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట నియోజకవర్గంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం పర్యటించారు. 15 కోట్లతో అక్కడి వేదాద్రి కంచల మిగతా2లో...

## భావ ప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల ప్రచారమా?


సోషల్ మీడియాలో పవన్‌పై విమర్శలు తగవు

మండిపడ్డ మంత్రి కందుల దుర్గేష్




## పొగాకు కొనుగోళ్లలో సిండికేట్ నిర్ధారణ అయితే చర్యలు

టొబాకో బోర్డ్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సూచన



**అమరావతి,మన జనప్రగతి జులై 03:** పొగాకు కొనుగోళ్లలో సిండికేట్ నిర్ధారణ అయితే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డ్‌కు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. అన్ని గ్రేడ్‌ల పొగాకును కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. వర్జీనియా పొగాకు కొనుగోళ్లపై మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లు వెంటనే ప్రారంభించాలని.. ప్రతి కంపెనీ తప్పనిసరిగా ఆక్షన్‌లో పాల్గొనాలన్నారు. పొగాకు రిజెక్షన్ రేటును కచ్చితంగా తగ్గించాలని ఆదేశించారు. కంపెనీలు సిండికేట్ అయి, మంచి బేల్స్‌పైనా సీలింగ్ పెట్టి ధరలు తగ్గిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కొనుగోళ్లపై టొబాకో బోర్డు కఠిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. టొబాకో బోర్డు మిగతా2లో...

## అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్

● అమరావతి రాష్ట్రానికి గుబండగా మారనుంది ● నిజానికి అక్కడి నేలలు కట్టడాలకు పనికిరావు ● అమరావతికి పెట్టే నిధుల్లో 10 శాతంతో మావిగన్ అద్భుతం ● మీడియా సమావేశంలో వైసిపి కో ఆర్డినేటర్ సజ్జల వ్యాఖ్యలు



**అమరావతి,మన జనప్రగతి జులై 03:** అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్ తయారుచేసుకున్నారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. అమరావతి రాష్ట్రానికి గుదిబండ.. కానుందని, స్కామ్‌లు చేయడానికే అమరావతి పెట్టారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అమరావతిలో పెట్టే నిధుల్లో 10 శాతం మావిగన్‌లో పెట్టినా ఎంతో అభివృద్ధి చేయొచ్చన్నారు.

మిగతా2లో...

## అమరావతిపై పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం

- మండిపడ్డ మంత్రి పార్థసారథి



**అమరావతి,మన జనప్రగతి జులై 03:** రాజధాని అమరావతిపై వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ దృష్టిలో రాష్ట్రాన్ని నిలబెడితే విలన్.. కూల్చేస్తే హీరోలా? అని నిలదీశారు. సీఎం చంద్రబాబు విలన్ ఎలా

మిగతా2లో...

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
04 - 07 - 2026

# రాయలసీమ ప్రాంతాన్ని 'ఉక్కుసీమ'గా మారుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. కేవలం విశాఖపట్నం మాత్రమే కాకుండా, రాయలసీమ ప్రాంతాన్ని కూడా 'ఉక్కుసీమ'గా మారుస్తామని హామీ ఇచ్చారు. గతంలో స్టీల్ ప్లాంట్ పేరుతో కొందరు ఐరన్ ఓర్‌ను దోచుకుంటూ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాయలసీమ ప్రాంతానికి రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకువచ్చామని అన్నారు. అంతేకాదు స్థానికంగా పరిశ్రమలు స్థాపించి ఇక్కడి యువతకే ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గతంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తీసుకురావడం వల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయన్నారు. ఇప్పటివరకూ అక్కడ 19 లక్షల కార్లు తయారయ్యాయని గుర్తుచేశారు. రాయలసీమకు ఎవరి వల్ల నష్టం జరిగింది, ఎవరి హయాంలో మంచి జరిగిందో ప్రజలు చరిత్రను ఒకసారి గుర్తుచేసు కోవాలని కోరారు. స్టీల్ ఎ÷-లాంట్ ఏర్పాటుతో రాయలసీమ చరిత్రలో నవశకం మొదలైంది. రాయలసీమ బిడ్డగా అభివృద్ధి చేసి చూపెడతా. రాయలసీమ అంటే కరవు నేల కాదు జలకళ కాబోతోందన్నారు. ఈ ప్రాంతం హార్టికల్చర్‌హబ్‌గా మారిపోయింది. విధ్వంస పాలనతో నష్టపోయిన రాష్ట్రానికి మళ్లీ ప్రాణం పోస్తున్నాం. పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలతో రాయలసీమ బిజీగా మారింది. రాళ్ల సీమ కాదు.. రతనాల సీమ అని చూపిస్తున్నాం. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సజ్జన్ జిందాల్ సిద్ధంగా ఉన్నారు. రాబోయే రోజుల్లో సీమకు అన్నీ మంచి రోజులే. రాయలసీమలో ఎ÷-లాంట్ ఏర్పాటు చేస్తామని ముందే మాట ఇచ్చాం. గతంలో మోసపూరిత శంకుస్థాపనలు చూశాం. 2019 డిసెంబరులో ఒకసారి, 2023లో రెండోసారి భూమిపూజ చేశారు. తట్ట మట్టి అయినా తీశారా.. చిన్న భవనమైనా కట్టారా? అడ్డంకులన్నీ తొలగించుకొని వచ్చాం, 1100 ఎకరాల భూమి ఇచ్చాం. రెండు స్టేజీల్లో రెండు మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగనుంది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ ఎలాంట్‌తో ఏపీ.. ఉక్కు రాష్ట్రంగా తయారవుతుంది. విశాఖ మాత్రమే కాదు.. రాయలసీమ కూడా ఉక్కుకు కేంద్రమవుతోందని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ఒకప్పుడు రాయలసీమలో ఉన్న ఫ్యాక్షన్ సంస్కృతిని అంతం చేశామని, సీమలో పారాల్సింది రక్తం కాదు.. సాగునీరు. ఫ్యాక్షనిజం పోయినప్పటికీ, నేరాలు చేసేవాళ్లు రాజకీయాల్లోకి రావడం దురదృష్టకరం అన్నారు. విధ్వంసమే అజెండాగా పెట్టుకున్న ఒక వ్యక్తి రాష్ట్రానికి ఏం చేయగలరు. 2014లో అమరావతిని రాజధానిగా అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు, అయితే అధికారంలోకి వచ్చాక.. మూడు రాజధానులంటూ నవ్వులపాలు చేశారు. మావిగన్, విజయవాడ అంటూ మతిస్థిమితం లేని వ్యక్తిలా మాట్లాడుతున్నారు. రేపు ఇంకేమంటారో తెలియని పరిస్థితి. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో రౌడీ మూకలు, గంజాయి బ్యాచ్‌లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోంది. ఇలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం.' అని సీఎం తెలిపారు.

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తు లకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వత మైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మి కులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపా రు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించా లని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశు భ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నా రు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనల ను, భద్రతా సూచనల ను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచిం చారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తుల ను కొనుగోలుకు కేటా యించాలి. ఇది అక్కడి కుటుం బాలకు, యువ తకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భం గా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారం లో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాల న్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బా ధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించా లి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థకు పూర్వ వైభవం

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల రిపేర్లు, పది సంవత్సరాలు పాటు నిర్వహణ పనుల కోసం 4,500 కోట్లతో టెండర్లు పిలుస్తున్నట్లు రామానాయుడు చెప్పారు.వైసీపీ పాలనలో ఇరిగేషన్ రంగానికి 18 వేల కోట్లు అప్పు పెట్టి వెళ్లిపోయాడన్నారు. పోలవరం డయాఫ్రమ్వాల్, అన్నమయ్య తదితర ప్రాజెక్టుల విధ్వంసానికి జగన్ కారకుడు అయ్యాడు అన్నారు. నిర్వహణ పనులు కోసం ఐదేళ్లలో వైసిపి 200 కోట్లు కేటాయిస్తే కూటమి ప్రభుత్వ హయాంలో రెండేళ్లలోనే 1200 కోట్లు ఖర్చు చేసినట్లు రామానాయుడు చెప్పారు. రాష్ట్రంలోని లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముల కింద 8.2 లక్షలు ఎకరాలు ఆయకట్టు ఉండగా గొడ్డలి పార్టీ విధ్వంసం వల్ల నాలుగు లక్షల ఎకరాలు మూత పడింది అన్నారు. వైకాపా హయాంలో మరమ్మత్తులకు ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడంతో లిఫ్ట్ స్కీములు మూతపడ్డాయి అన్నారు. రాష్ట్రంలో 1023 లిఫ్ట్ స్కీములు ఉంటే కేవలం 166 మాత్రమే పని చేస్తున్నాయని మంత్రి చెప్పారు. 2021 నుండి వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం పనిచేయపోవటానికి వైసిపి ప్రభుత్వ నిర్వాకమే కారణమని ఆయన అన్నారు. 15 కోట్లతో చేపడుతున్న ప్రస్తుత పునరుద్ధరణ పనులు పూర్తి అయితే జగ్గయ్య పేట, నందిగామ నియోజకవర్గాల్లోని 17,366 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించగలదన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో, వేదాద్రి కంచల లిఫ్ట్ స్కీం నిర్వహణ కోసం, 5.36 కోట్లు ఖర్చు చేసి సాగునీరందించామని ఆయన గుర్తు చేశారు. 2027 ఖరీఫ్ సీజన్ నాటికి వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామ న్నారు. 5 ఏళ్ళ వైసిపి పాలనలో ఇరిగేషన్ రంగం విధ్వంస మైందనడానికి ఐడిసినే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన ఉదహరించారు. రాజధాని విషయంలో జగన్ మావిగన్ అంటూ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. పూటకో మాట, పేటకో మాట అన్న చందంగా ఉంది ఆయన తీరు అన్నారు. ప్రతిపక్షంలో ఉండగా అమరావతిని ఆహ్వానించి అధికారంలోకి వచ్చాక, మూడు రాజధానులు అంటూ మూడుముక్కలాటాడారు అన్నారు. తెలంగాణకు హైదరాబాదు, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధాని నగరాలుగా ఉంటూ లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్నాయన్నారు. అలాగే అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారన్నారు. ఫలితంగా ఏటా లక్ష కోట్లు రూపాయలు ఆదాయం వస్తుందన్నారు. ఈ లక్ష కోట్లతో 175 నియోజకవర్గాలను అభివృద్ధి చేయవచ్చు అన్నారు.కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేసినేని చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీరామ్ తాతయ్య, తంగిరాల సౌమ్య, ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఐడీసీఎండి తిరుమల రావు, కెడిసి సిఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

# అవినీతి, స్కామ్‌లకు చంద్రబాబు బ్లూప్రింట్

(మొదటి పేజీ తరువాయి)

మావిగన్‌పై వైఎస్ జగన్ మరోసారి స్పష్టత ఇచ్చారు. ప్రపంచస్థాయి రాజధాని అన్న చంద్రబాబు ఇప్పుడు మున్సిపాలిటీ అంటున్నారు. రాజధానికి ప్రభుత్వ భూమి ఉంటే మంచిదని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి నేల రాజధానికి పనికిరాదని గతంలో చాలా మంది చెప్పారు. అమరావతి నేల కుంగిపోతుంది.. ఇది ప్రమాదకరం. అమరావతి పూర్తి చేయాలనే ఉద్దేశం చంద్రబాబుకు లేదు. వైఎస్ జగన్ అడిగిన ప్రశ్నలకు టీడీపీ నేతలు ఎక్కడైనా సమాధానం ఇస్తున్నారా? అంటూ సజ్జల ప్రశ్నించారు.'మావిగన్‌లో తక్షణ అభివృద్ధికి అవకాశం ఉంది. అమరావతి అప్పుల భారాన్ని రాష్ట్రం మోయలేదు. రైతులు ఇచ్చిన భూముల్లో లే అవుట్‌లు కూడా అభివృద్ధి చేయడం లేదు. లే అవుట్‌లు అభివృద్ధి చేయలేకపోతే రైతుల పరిస్థితి ఏంటీ?. అమరావతి కోసం అప్పు తెచ్చిన రూ.47 వేల కోట్లతో మెడికల్ కాలేజీలు, మచిలీపట్నం పోర్టు, హంద్రీనీవా కాలువ పూర్తి చేయొచ్చు. పాఠశాలలు దేవాలయాలు మాదిరిగా ఉండాలి. ఇప్పుడు ఎలా ఉన్నాయి?. ఛత్తీస్‌గఢ్ నయా రాయ్‌పూర్‌లో ఎవరుంటున్నారు?. చదరపు అడుగుకు రూ. 20 వేల ఖర్చు ఏంటీ? ఎక్కడైనా ఉందా?. ప్రశ్నిస్తే గొంతు నొక్కుతున్నారు.. భయపెడుతున్నారు' అని సజ్జల రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మావిగన్ అనగానే చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. అమరావతికి, మావిగన్‌కు మధ్య తేడా ఏంటో వైఎస్ జగన్ పలుమార్లు చెప్పారు. దాని గురించే మరోసారి వైఎస్ జగన్ స్పష్టత ఇచ్చారు. చంద్రబాబు చెప్తున్న అమరావతి అసాధ్యమైనదని, దాంట్లో 10 శాతంతో మావిగన్ అవుతుందని చెప్పారు. మావిగన్ ఆలోచనతో చంద్రబాబుకు పడరానిచోట దెబ్బ పడుతోంది. మావిగన్ అనగానే.. గుంటూరు, విజయవాడ కూడా మావిగన్‌లో భాగమేనని చంద్రబాబు అంటున్నారు. అమరావతికోసం చంద్రబాబు పెట్టాలనుకుంటున్న రూ.2 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టే ప్రాంతంలో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ఉన్నాయా?. కానీ మావిగన్‌లో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం ఉన్నాయి. ఇప్పటికే వెస్ట్రన్ బైపాస్ వచ్చింది. సహజంగానే అమరావతి అభివృద్ధి చెందుతుందని సజ్జల వివరించారు. ప్రభుత్వ భూమి అయితే రాజధానికి బెటర్ అని వైఎస్ జగన్ చాలా స్పష్టంగా చెప్పారు. అందరికీ అందుబాటులో రాజధాని ఉంటుందని ఆరోజు అన్నారు. అమరావతిలో అవినీతి, దోపిడీ, ఆర్థిక భారం.. ఈ అంశాలన్నీ చెప్పారు. రాష్ట్రంలో ప్రజల డబ్బును వృథా చేయొద్దన్నందుకు వైఎస్ జగన్‌పై పడుతున్నారు. మాట మార్చింది వైఎస్ జగన్ కాదు.. కూటమి నాయకులే. మూడు రాజధానుల ప్రతిపాదనలో అమరావతికీ చోటు ఉంది. అమరావతి ప్రాధాన్యతను తగ్గించలేదు. లెజిస్లేచర్ క్యాపిటల్‌గా ఆ ప్రతిపాదనలో చోటు ఉంది. పైగా రైతులకు మేలు చేసింది వైఎస్ జగనే. అమరావతిలో వర్టికల్ డెవలప్‌మెంట్ చేస్తున్నారు. భూమి ఉన్నప్పుడు వర్టికల్ డెవలప్‌మెంట్ ఎందుకు చేస్తున్నారు?. రూపాయి అయ్యే చోట వంద రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నారు?. ఆ డిజైన్లకు ఎంత డబ్బు పెట్టినా అవుతుందా?. ఏ పనీ చేయకపోయినా రూ.47 వేల కోట్ల అప్పులు తెచ్చారు. రూ.60 వేల కోట్ల పనులు అప్పగించేశారు. ఈ రూ.47 వేల కోట్లతో పోర్టులు, రాయలసీమ లిఫ్ట్, మెడికల్ కాలేజీలు, వెలిగొండ నిర్వాసితుల సమస్య, పోలవరం నిర్వాసితుల సమస్య, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇవన్నీ కూడా పూర్తి చేయవచ్చని సజ్జల వివరణ ఇచ్చారు.

# ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం – తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

# పొగాకు కొనుగోళ్లలో సిండికేట్ నిర్ధారణ అయితే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సూచనల మేరకు రైతులు పొగాకును ఆక్షన్‌కు తీసుకురావాలని... తద్వారా మంచి ధర లభిస్తుందని, రిజెక్షన్ రేటు తగ్గుతుందని మంత్రి తెలిపారు. టొబాకో బోర్డు, బ్యాంకర్లతో చర్చించి పొగాకును నిల్వ ఉంచాలనుకునే రైతులకు రుణాలు అందిస్తామన్నారు. రైతులకు న్యాయమైన ధర వచ్చేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పొగాకు రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. ఆక్షన్‌లో పాల్గొనని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని బోర్డును ఆదేశించారు. సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా పొగాకు ఆక్షన్ ప్లాట్‌ఫారమ్‌లను పరిశీలిస్తున్నారని.. సిండికేట్ నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని టొబాకో బోర్డ్ ప్రతినిధులకు సూచిస్తున్నారని తెలిపారు. పొగాకు కొనుగోళ్లలో ఎలాంటి అక్రమాలు సహించమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా ఎస్‌బీవీ స్వామి, టొబాకో బోర్డు ఛైర్మన్, ఈడీ, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ పాల్గొన్నారు.

# అమరావతిపై పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

అయ్యారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి రాజధానిపై అవాకులు, చెవాకులు పేలడం పూర్తిగా హాస్యాస్పదం. మీరు చెప్పే మావిగన్‌లో గుంటూరు ఉంది. అమరావతి కూడా గుంటూరు పరిధిలోనే ఉందని మరిచారా?అమరావతిపై పూటకో మాట.. నిమిషానికొక విష ప్రచారం వైకాపాది. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా.. రాష్ట్రమంతా అమరావతితోనే. అమరావతి అజేయం.. అమరావతే శాశ్వతం' అని మంత్రి పార్థసారథి అన్నారు. మీ రాజధాని ఏదంటే కాలర్ ఎత్తుకొని చెప్పే విధంగా అమరావతిని సీఎం చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. రాజధానిపై జగన్ రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. మొన్న మావిగన్.. నిన్న విజయవాడ.. రేపేమంటారో అని ఎద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి రాజధానిపై ఎన్నిరకాలుగా ఆడుకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మతిస్థిమితం లేని వ్యక్తిగా రాజకీయం చేయడం దారుణమన్నారు. రాష్ట్రం ఆత్మాభిమానంతో ఆడుకోకూడదని అన్నారు.

# భావ ప్రకటన స్వేఛ అంటే బూతుల ప్రచారమా?

**విజయవాడ,మన జనప్రగతి జులై 03:**సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు, వ్యక్తిగత దూషణలు, తప్పుడు ప్రచారాలపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్రంగా స్పందించారు. భావప్రకటన స్వేచ్ఛ అంటే బూతుల లైసెన్స్ కాదని హెచ్చరించారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని కొందరు సోషల్ మీడియాలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా బలహీనపరిస్తే కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయవచ్చన్న వ్యూహంతో వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేవలం వ్యూస్ పెంచుకోవడం, బ్లాక్‌మెయిలింగ్ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేరును ఉపయోగించడం సరికాదని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రశ్నించే హక్కుంది.. కానీ హద్దులు దాటే హక్కు లేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై నియంత్రణ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈసందర్భంగా రుషికొండ ప్యాలెస్ అంశంపైనా మంత్రి స్పందించారు. రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటకాభివృద్ధి, ప్రజల సందర్శన కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ ను ఆహ్వానించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వ విధానాల కారణంగా పర్యాటక శాఖకు ఏటా సుమారు రూ.7 కోట్ల నష్టం వాటిల్లిందని, ఇకపై పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. 40 మంది మృతి

**ఇస్లామాబాద్,మన జనప్రగతి జులై 03:**పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు.

వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
04 - 07 - 2026

# టిబి రహిత రేపటి కోసం ఛాతీ ఎక్స్-రేలు

● (పీలేరు టిబి నియంత్రణ విభాగ పర్యవేక్షకులు మోహన్ )



**పీలేరు మన జనప్రగతి జులై 03:-** ఛాతిలో క్షయ ఉధృతిని కనుగొనే "హెచ్ హెచ్ ఎక్స్ - రే " ని అందరూ సద్వినియోగం చేసుకుని టిబి రహిత ముందు తరానికి చేయూత నివ్వాలని పీలేరు టిబి నియంత్రణ విభాగ పర్యవేక్షకులు మోహన్, పవన్ కుమార్ ప్రజలకు తెలిపారు. 100 దినాలు కార్యక్రమంలో భాగంగా నేడు పీలేరు పట్టణంలో ని సాయిరాం వీధి లో 108 మందికి టిబి వ్యాధి నిర్ధారణకై ఎక్స్-రే లు తీయడం జరిగిందని తెలియజేశారు. క్షయ వ్యాధి నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని, ఒక్కోసారి ఎలాంటి ప్రమాదం హెచ్చరికలు లేకుండా వచ్చే ప్రమాదముందని, కావున మనందరి ఆరోగ్య భద్రతకై 18 సంవత్సరాలు వయస్సు దాటిన అందరు "హెచ్ - హెచ్ ఎక్స్-రే" తీసుకోవాలని,ఇది మన గ్రామంలోనే మనకోసం ప్రభుత్వం కల్పించిన ఓ.. ప్రతిష్టాత్మక మొబైల్ ఎక్స్- రే విధానమని,వ్యాధి నిర్ధారణ ,నియంత్రణకై సత్వర చికిత్స ముఖ్యమని పర్యవేక్షణధి కారులు ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీలేరు టిబి యూనిట్ పర్యవేక్షకులు మోహన్,పవన్,పిహెచ్ యన్ కుసుమ,ఏ యన్ యం భార్గవి,లక్ష్మీ,సి హెచ్‌ఓలు,చంద్రకళ, నాగముత్యం,సౌజన్య,ఎక్స్-రే టెక్నీషియన్ రిహానా,ఆశా కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

## ఓటరు జాబితా స్వచ్ఛత కచ్చితత్వ పరిరక్షణకే సర్ ప్రోగ్రాం

## పులివెందుల రెవెన్యూ అధికారి నజీర్ అహమ్మద్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 03:-**అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని ఓటరు జాబితా స్వచ్ఛత పరిరక్షించేందుకు నిబంధనలు కఠినంగా అమలు చేస్తున్నట్లు పులివెందుల తహసిల్దార్ నజీర్ అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం ఎర్రగుడిపల్లి 15వ వార్డు లో ఎమ్మార్వో విజిట్ చేయడం జరిగింది.విఆర్ఓ, బిఎల్ఓ తో కలిసి 133.134. బూతు ఓటర్లు సర్వే చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మార్వో నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదు కావడానికి అర్హుడు కారని ఓటర్లు బిఎల్ఓ లకు సహకరించి తమ ఓటును సంరక్షించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది మరియు ఆ ప్రాంత ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో రోగులకు పాలు బ్రెడ్లు పంపిణీ



**ఆదోని మన జనప్రగతి జూలై 03:-** ఆసుపత్రికి వచ్చే రోగులకు అల్పాహారం కింద పాలు బెడ్లు పంపిణీ ప్రతివారం నిర్వహిస్తున్నట్లు ఏఐఎంఐఎం పట్టణ అధ్యక్షుడు తెలిపారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏఐఎంఐఎం పార్టీ నాయకులు రోగులకు వారి బంధువులకు పాలు, బ్రెడ్లు పంచిపెట్టారు. ప్రతి శుక్రవారం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఏఐఎంఐఎం నాయకులకు రోగులు వారి బంధువులు ప్రశంసించారు. ప్రతి శుక్రవారం ఇలాంటి సేవా కార్యక్రమం ఆసుపత్రిలో కొనసాగుతుందని మహమ్మద్ జునైద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు సద్దాం హుస్సేన్, నాసిర్ హుస్సేన్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# మదీనా మసీదు అభివృద్ధికి సహకరించండి

## - ఎంపీ అవినాష్ రెడ్డికి వినతి అందించిన మసీదు కమిటీ



**పులివెందుల అర్బన్ జనప్రగతి జులై 03:-**చెన్నారెడ్డి కాలనీలోని మదీనా మసీదు మరమ్మతులు,అభివృద్ధి పనుల కొరకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా ఆధ్వర్యంలో మసీదు కమిటీ సభ్యులు శనివారం పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) వై.ఎస్.అవినాష్ రెడ్డిని కలిసి వినతి అందించారు.ఈ సందర్భంగా మదీనా మసీదు ప్రెసిడెంట్ సత్తార్,వైస్ ప్రెసిడెంట్ బాబావలి,సెక్రటరీ అక్బర్ వలి,ట్రెజరర్ బాబావలితో పాటు కమిటీ ప్రతినిధులు రాజాహుసేన్, అక్బర్,బాబ్జాన్ తదితరులు ఎంపీని కలిసి మసీదులో చేపట్టాల్సిన పునర్నిర్మాణ,మరమ్మతు పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కమిటీ సభ్యుల విజ్ఞప్తిపై ఎంపీ అవినాష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.మసీదు అభివృద్ధి పనులకు తన వంతుగా తగిన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.కాగా,మసీదు మరమ్మతుల నిమిత్తం సుమారు రూ 50,000 వరకు ఆర్థిక సహాయం అందే అవకాశం ఉందని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# దొంగతనం కేసులో వ్యక్తికి 6 నెలల జైలుశిక్ష

## - తీర్పు వెలువరించిన న్యాయమూర్తి చంద్రశేఖర్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జులై 03:-** దొంగతనానికి పాల్పడిన కేసులో ముద్దాయి మలిరెడ్డి జయప్రకాష్ రెడ్డి(37)కీ 6 నెలల జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ పులివెందుల జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది నవంబర్ 17న స్థానిక కల్లూరి హరికృష్ణ షాపు స్వేటర్ పగలగొట్టి ఎల్ఇడి టీవీ ని దొంగలించుకొని పోయారని పోలిస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో పోలిసులు ముద్దాయిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి ఎల్ఇడి టీవీ స్వాధీనం చేసుకుని రిమాండ్ కి తరలించారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున సమర్థవంతంగా వాదనలు వినిపించిన జి.మధుసూదన(ఏపిపి), అలాగే వేంపల్లె సిఐ నరసింహులు, ఎస్సై తిరుపాల్ నాయక్, కోర్టు కానిస్టేబుల్ బాబా ఫక్రుద్దీన్ లను జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

# సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలి

## ప్రజల నుండి సానుకూల స్పందన పెంచే విధంగా అధికారులు ప్రజలకు సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో,తుగ్గలి మన జనప్రగతి జూలై 03:-** ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శుక్రవారం పత్తికొండ నియోజకవర్గం తుగ్గలి మండల కేంద్రంలో ఒక నెల ఒక గ్రామం కార్యక్రమం 4 వ పర్యటన లో భాగంగా ప్రజల నుండి ఫిర్యాదులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రీ ఓపెన్, ఇంప్రాపర్ రెడ్రెసల్ కేసులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు పరిష్కరించడం పై అధికారులు, సిబ్బందికి ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో అర్జీలు పరిష్కారం కావడంలేదని, అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలలో అధిక శాతం భూమికి సంబంధించినవే ఉన్నాయని, ఈ విషయంలో రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని పరిష్కారం దిశగా కృషి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు తుగ్గలి మండలంలో నిర్వహించిన 4 పీజీఆర్ఎస్ కార్యక్రమాల్లో మొత్తం 300 అర్జీలు రావడం జరిగిందని, అందులో 105 పరిష్కరించగలిగామని కలెక్టర్ తెలిపారు. రీ సర్వేలో ఎక్స్టెంట్ వేరియేషన్, 22ఎ సంబంధించిన అర్జీలు ఎక్కువగా రావడం జరుగుతోందని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. పరిష్కరించడానికి సమయం పట్టే వాటిని మాత్రం ప్రయారిటీలో (ప్రాధాన్యత క్రమంలో) పెట్టుకుని, వాటిని కూడా ఒక నెల లేదా ఒకటిన్నర నెలలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామ న్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఉమ్మడి గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, డిఆర్డిఏ పిడి రమణా రెడ్డి, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి

## డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి: బీఎల్ఓలకు ఆదేశం



**మదనపల్లె, మన జనప్రగతి జూలై 03:-** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజేషన్ పనులను మదనపల్లె సబ్ కలెక్టర్ శ్రీమతి చల్లా కళ్యాణి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు నెం. 101, 102లను మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో కలిసి సందర్శించిన సబ్ కలెక్టర్, అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) చేపడుతున్న ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం, సంబంధిత రికార్డులు, నమోదు పురోగతి, సాంకేతిక అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి ఓటరు వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలించి, పూర్తి ఖచ్చితత్వంతో డిజిటలైజేషన్ చేపట్టాలని బీఎల్ఓలకు సూచించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ పురోగతిని ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఎదురైన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న బీఎల్ఓలు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సహకారంతో ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, సంబంధిత ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రుణం అందించండి

## జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి.

## జిల్లాలో తలసరి ఆదాయాన్ని రెండు నుండి మూడు లక్షలకు పెంచడమే లక్ష్యం.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 03:-**జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ బ్యాంకింగ్ సేవలు అందాలని, ముఖ్యంగా బలహీన వర్గాలు, రైతులు మరియు మహిళా సంఘాలకు రుణాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి బ్యాంకర్లను ఆదేశించారు. కలెక్టరేట్ లో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం), వివిధ బ్యాంకుల ప్రతినిధులు మరియు సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజల తలసరి ఆదాయాన్ని ప్రస్తుతమున్న రూ. 2 లక్షల నుండి రూ.3 లక్షలకు పెంచడమే ఈ ఏడాది తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని, గడువు లోపల నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు.సమీక్షలోని ముఖ్యాంశాలు:గడువుల విధింపు: వివిధ ప్రభుత్వ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను జూలై 10 మరియు ఈ నెల ఆఖరిలోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కెనరా బ్యాంక్, ఏపిజిబి, ఎస్.బి.ఐ బ్యాంకులు తమ పరిధిలోని దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని పేర్కొన్నారు.చిన్న రుణాలకు సిబిల్ (సిబిల్) నిబంధనలపై అసంతృప్తి: లైవ్‌స్టాక్ (పశు సంవర్ధక), వ్యవసాయం తదితర రంగాల్లో రూ. 1 - 2 లక్షల వంటి చిన్న రుణాలకు కూడా బ్యాంకర్లు సిబిల్ స్కోర్ నిబంధనలను కఠినంగా అమలు చేయడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్న వెనుకబడిన ప్రాంతాలలో, వ్యవసాయం మరియు దాని అనుబంధ రంగాలపై ఆధారపడిన పేద ప్రజల పట్ల బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించి, నిబంధనలలో అవసరమైన సడలింపులు (కూలింగ్ పీరియడ్) ఇవ్వాలని కోరారు.కౌలు రైతులకు సంయుక్త బాధ్యత సంఘాల (జాయింట్ లయబిలిటీ గ్రూప్స్) ద్వారా రుణాలు: కౌలు రైతులకు (సిసిఆర్‌సి కార్డు దారులు) మరియు స్వయం సహాయక సంఘాల (ఎస్.హెచ్.జి) మహిళలకు రుణాల పంపిణీపై సుదీర్ఘంగా చర్చించారు. ఒకే భూమిపై భూయజమాని, కౌలు రైతు ఇద్దరికీ సాంకేతికంగా రుణాలు ఇవ్వడంలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలతో కౌలు రైతుల జాయింట్ లయబిలిటీ గ్రూపులను (జె.ఎల్.జి) ఏర్పాటు చేసి, జూలై 15 లోగా అర్హులకు రుణాలు అందేలా చూడాలని డిఆర్డిఎ, మెప్మా అధికారులను ఆదేశించారు.మత్స్యకార రంగానికి చేయూత: ఈ ఏడాది జిల్లాలో మత్స్య సంపద పెంపకానికి (137 లక్షల స్పాన్ రేరింగ్) పెద్ద ఎత్తున టార్గెట్ నిర్దేశించుకున్నామని, కావున ఫిషరీస్ కార్డ్స్ ఉన్న వారందరికీ తగినన్ని రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు.లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని, అలా చేరుకున్న బ్యాంకులకు ప్రభుత్వ నిధుల డిపాజిట్లు రూపంలో ప్రోత్సహిస్తామని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో డిఆర్డిఎ పిడి రమణారెడ్డి, మెప్మా పిడి శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్, ఏపీఎంఐపి పిడి సుధాకర్ మరియు వివిధ బ్యాంకుల రీజినల్ మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మానవత సేవలు చిరస్మరణీయం: వేంపల్లి అధ్యక్షునిగా పోలూరు సుభాష్



**వేంపల్లె మన జనప్రగతి జూలై 03:** సమాజంలోని పేదల కన్నీరు తుడవడంలో మానవత సేవా సంస్థ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ అధ్యక్షునిగా గండి రోడ్డులోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు పోలూరు సుభాష్ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే కార్యవర్గ సభ్యులు, అనుబంధ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ మానవత ద్వారా వైకుంఠ రథం, ఉచిత బాడీ ఫ్రీజర్లు, ఎలాంటి కష్టాల్లో ఉన్నవారికి ఇతోధిక సాయం చేయడం హర్షిని యమన్నారు. తోటివారి కష్టాలను అర్థం చేసుకుని, ప్రేమతో సహాయం చేయడం వల్ల మన అంతరాత్మకు మనశ్శాంతి కలుగుతుందని వెల్లడించారు. సమాజంలో ఎంతోమంది నిస్సహాయ స్థితిలో ఉన్నారని, వారికి మేమున్నాం అని మనోధైర్యం కల్పిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి దోహద పడేలా జీవిత పయణం కొనాసాగాలని పిలుపునిచ్చారు. సమాజం పట్ల బాధ్యత కలిగి నిస్సహాయులైన వారికి అండగా నిలవడమే మానవ లక్ష్యంగా చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో మానవత సేవలు విస్తృతం చేసేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటీ వేంపల్లె శాఖ చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి, సహాయ చైర్మన్ రంగారెడ్డి, గ్రామపంచాయతీ మాజీ ఈవో నాగభూషణ్ రెడ్డి కన్వీనర్ డా.యోగీశ్వర్ బాబు, నామా ధనుంజయ, పుల్లగూర అరవింద్, ఎస్దాన్, శివ మహేశ్వర్ రెడ్డి రాచవీటి తేజ చైతన్యకుమార్ డైరెక్టర్లు, అడ్వైజరీ బోర్డు, ఇసి సభ్యులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రికి సాదర వీడ్కోలు





**కడప మన జనప్రగతి జూలై 03:-**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వై ఎస్ ఆర్ కడప జిల్లా ఒకరోజు పర్యటన ను ముగించు కొని మ.2.40 గం.లకు హెలిప్యాడ్ నుండి ప్రత్యేక హెలికాప్టర్ లో కుప్పం నకు బయలు దేరగా సాదర వీడ్కోలు లభించింది...జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ప్రభుత్వ విప్ మరియు జమ్మలమడుగు శాసన సభ్యులు సి.ఆదినారాయణ రెడ్డి,డి ఐ జి కోయా ప్రవీణ్, ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్,కమలాపురం,మైదుకూరు శాసనసభ్యులు పుట్టా కృష్ణ చైతన్య రెడ్డి,పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు భూపేష్ రెడ్డి ప్రజా ప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు..

## ఆపదలో ఉన్న సీనియర్ పాత్రికేయుడికి చేయూత

**- బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత**



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 03:-** మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు పెండ్లిమర్రి మల్లేశ్వరరావుకు సమేరిటన్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక, సామాజిక చేయూత అందించింది. షుగర్ వ్యాధి కారణంగా కాలు కోల్పోయి కుటుంబ పోషణ భారంగా మారడంతో, జీవనోపాధికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయన కడపకు చెందిన సమేరిటన్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆశ్రయించారు. దీనికి స్పందించిన ట్రస్ట్ ప్రతినిధులు 25 కిలోల బియ్యం బస్తాతో పాటు నిత్యావసర సరుకులను స్థానికులు అవ్వారు రవిశంకర్, పుత్తా సుధీర్ రాయల్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడికి భవిష్యత్తులోనూ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జింకా శివ కుమార్, డాక్టర్ లక్ష్మీనారాయణ, జానపాటి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అశ్విని నిశ్చితార్థ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన మంత్రి మండిపల్లి



**చిన్నమండెం మన జనప్రగతి జులై 03:-**చిన్నమండెం మండలం కొత్తపల్లి పంచాయతీ ఆర్ & ఆర్ కాలనీకి చెందిన చెర్లోపల్లి ఆంజనేయులు కుమార్తె అశ్విని నిశ్చితార్థ వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన & క్రీడల శాఖ మంత్రి, రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. కాబోయే వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి గారు, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లాలో పోలీసుల అర్ధరాత్రి నిఘా

**అన్నమయ్య ప్రతినిధి మన జనప్రగతి జులై 03:-** జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు జిల్లావ్యాప్తంగా రాత్రివేళల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు.రాత్రి విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది, నైట్ బీట్ బృందాల పనితీరును పోలీసు అధికారులు స్వయంగా తనిఖీ చేస్తూ అప్రమత్తం చేస్తున్నారు.రాత్రుళ్ళు అనవసరంగా అనుమానాస్పదంగా తిరిగే వారిని అత్యాధునిక ఫింగర్ ప్రింట్ పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.డ్రైవర్లు నిద్రమత్తు వల్ల ప్రమాదాల బారిన పడకుండా, వాహనాలు నిలిపి ముఖం కడుక్కునేలా చేసి సురక్షితంగా పంపుతున్నారు.ప్రధాన కూడళ్లలో విస్తృతంగా తనిఖీలు చేస్తూ భద్రతను కట్టుదిట్టం చేశారు.ఈ ఆకస్మిక తనిఖీలు జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ నిరంతరాయంగా కొనసాగుతాయని పోలీస్ యంత్రాంగం తెలిపారు .

## మైనర్ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి 3 ఏళ్ల జైలు



**పులివెందుల రూరల్ మన యిజూలై 03:-** పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు మైనర్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, వారిని బెదిరించిన కేసులో ముద్దాయి సైదర్ వల్లికి కడప ప్రత్యేక పోక్సో కోర్టు మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.3 వేల జరిమానా విధించింది.పోలీసుల వివరాల ప్రకారం.. 2023 జూన్ 20న ఇ.కొత్తపల్లె గ్రామంలోని పీర్ల చావిడి సమీపంలో పెట్టీ షాప్ నిర్వహిస్తున్న సైదర్ వల్లి (50) ఆడుకుంటున్న ముగ్గురు మైనర్ బాలికలు (6, 7, 9 సంవత్సరాలు) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, బెదిరించాడు. బాధిత బాలికలలో ఒకరి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పులివెందుల యు/జి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు.కేసును విచారించిన కడప ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.ఏ. సోమశేఖర్ ముద్దాయిపై అభియోగాలు రుజువయ్యాయని నిర్ధారించారు. దీంతో ఐపీసీ సెక్షన్ 354-ఏ కింద రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా, సెక్షన్ 506 కింద రూ.1,000 జరిమానా, అలాగే పోక్సో చట్టంలోని సెక్షన్ 8 చదవవలసిన 7 కింద మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు. అన్ని శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని కోర్టు ఆదేశించగా, మొత్తం రూ.3 వేల జరిమానాను ముద్దాయి చెల్లించాడు.ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి, కోర్టులో విజయవంతంగా నడిపిన దర్యాప్తు అధికారి ఎం. సత్యనారాయణ (ఎస్ఐ), ఇన్‌స్పెక్టర్ కె. శ్రీరామ్, కోర్టు మానిటరింగ్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొమ్మినేని వేణుగోపాల్, కోర్టు కానిస్టేబుల్ సి. సుబ్బయ్యలను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, అభినందించారు.

## ప్రజల మన్ననలు పొందిన పుష్పనగేష్

**• ఘనంగా సత్కరించిన కాలనీ వాసులు**




**పటాన్ చెరువు మన జనప్రగతి జూలై 03:-** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులకు కృతజ్ఞతగా కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు కలిసి శుక్రవారం అసోసియేషన్ భవనం వద్ద రామచంద్రపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌ను ఘనంగా సన్మానించారు.గత ఐదేళ్లలో కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు, మౌలిక వసతుల అభివృద్ధికి విశేష కృషి చేసి, ప్రజలు ఎప్పుడైనా సమస్యలు తెలియజేస్తే వెంటనే స్పందించి పరిష్కరించారని కాలనీ వాసులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడం వల్ల కాకతీయ నగర్ కాలనీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని వారు తెలిపారు.అదేవిధంగా డివిజన్ చరిత్రలోనే తొలిసారిగా కాకతీయ నగర్ సొసైటీ కార్యాలయ ఆవరణలో సుమారు రూ.3.50 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలు, ఆహ్లాదకర వాతావరణంతో కూడిన థీమ్ పార్క్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ పార్క్ పిల్లలు, మహిళలు, వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు.పదవీకాలం ముగిసే ముందు మహిళల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని సొసైటీ కార్యాలయం పైభాగంలో మహిళా సంఘాల కోసం రూ.25 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య భవనం నిర్మాణ పనులు ప్రారంభించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని పనులను ప్రారంభించడం నాయకత్వానికి నిదర్శనమని కొనియాడారు. కాలనీ మహిళలు, యువకులు మాట్లాడుతూ ప్రజాసేవలో ఇదే అంకితభావంతో కొనసాగుతూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎల్లప్పుడూ తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. అనంతరం కాలనీ వాసులు సంబరాలు నిర్వహించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## కొత్త పింఛన్లకు మోక్షం ఎప్పుడు..?: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్



**పటాన్ చెరువు మన జనప్రగతి జూలై 03:-** కొత్త పింఛన్లకు మోక్షం ఎప్పుడనినవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షులు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారుతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు 30 నెలలు పూర్తవుతున్నా, సామాజిక భద్రతా పింఛన్ల విషయంలో కొత్తగా అర్హత పొందిన వేలాది మంది నిరుపేదలు ఇంకా ఎదురుచూపుల్లోనే ఉన్నారు.ఎన్నికల సమయంలో సామాజిక పింఛన్లను పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదు. కనీసం కొత్తగా అర్హత పొందిన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ ప్రక్రియ పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు.ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించడంతో పాటు, "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో కూడా కొత్త పింఛన్ల మంజూరును ప్రస్తావించారు. అలాగే, రాష్ట్ర బడ్జెట్‌లో 2 లక్షల మంది కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తామని ప్రకటించారు. అనంతరం మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి గారు జూన్ 2 నుంచి కొత్త పింఛన్లు అమలు చేస్తామని వెల్లడించారు. అయితే, జూలై నెల ప్రారంభమైనా ఈ అంశంపై స్పష్టమైన అమలు కనిపించడం లేదు.గత కొన్ని సంవత్సరాలుగా కొత్త పింఛన్ల కోసం సమర్పించిన అనేక దరఖాస్తులు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో పెండింగ్‌లోనే ఉన్నాయి. అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మరియు ఇతర సామాజిక భద్రత అవసరమైన లబ్ధిదారులు తమ దరఖాస్తుల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు.అందువల్ల, రాబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పెండింగ్‌లో ఉన్న అర్హులైన దరఖాస్తులను పరిశీలించి, కొత్త పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నాను.ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు పింఛన్ పెంపు అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, కనీసం కొత్తగా అర్హత పొందిన వారికి ఆలస్యం లేకుండా పింఛన్లు మంజూరు చేయడం అత్యవసరం.అర్హులైన ప్రతి నిరుపేదకు సామాజిక భద్రత అందించడం ప్రభుత్వ బాధ్యత. కొత్త పింఛన్ల మంజూరుపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని నవభారత్ నిర్మాణ్ యువసేన అధ్యక్షులు తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేయడం జరిగింది

## గండిక్షేత్రంలో శ్రావణమాసం ఉత్సవాలకు జెర్మన్ షెడ్ ఏర్పాటుకు వినతి



**చక్రాయపేట మన జనప్రగతి జూలై 03:-** మండలంలోని గండిక్షేత్రంలో శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆగస్టు 13వ తేది నుండి శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ విశ్వనాధ్ తెలిపారు.ఈ మేరకు టీడీపీ పులివెందుల నియోజకవర్గపు ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీ.టెక్ రవి) సూచనల మేరకు శుక్రవారం ఆలయ ఆలయ కమీషనర్ విశ్వనాధ్,ఆలయ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి,ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి కలసి తిరుమల తిరుపతి దేవస్థానముల ఇంజినీరింగ్ విభాగపు అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.ఆగస్టు 13 నుండి గండిక్షేత్రంలో నిర్వహించే స్వామివారి శ్రావణమాసం ఉత్సవాలకు జర్మన్ షెడ్,50 మంది పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు.దీనికి వారు సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామని తెలిపారు.అలాగే ప్రాంతీయ సంయుక్త తిరుపతి అధికారి మహేశ్వర్ రెడ్డిని కలిసి గండిక్షేత్రంలోని ఆలయ అభివృద్ధిపై చర్చించారు.

## రైతులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను ప్రజలు నమ్మరు: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి,మన జనప్రగతి జులై 03:-** ఈ-పంట నమోదుపై వస్తున్న ఆరోపణలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఖండించారు. వైసీపీ హయాంలో ఖరీఫ్-2024లో 41.87 లక్షల మంది రైతుల 96.78 లక్షల ఎకరాలు నమోదు కాగా, కూటమి ప్రభుత్వం ఖరీఫ్-2025లో 53.32 లక్షల మంది రైతుల 117.39 లక్షల ఎకరాలను నమోదు చేసి పురోగతి సాధించిందని తెలిపారు.ల్యాండ్ పార్సిల్స్ నమోదు 106.38 లక్షల నుంచి 198.93 లక్షలకు పెరిగిందని, రబీ 2025-26లో 99.7 శాతం ఈ-పంట నమోదు పూర్తయిందన్నారు. ఖరీఫ్-2026లో APAIMS 2.0 ద్వారా జియో-రెఫరెన్సింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఉపగ్రహ సాంకేతికత, మూడు దశల ఎస్ఎంఎస్ సమాచారం, రైతుల స్వీయ నమోదు, గ్రీవెన్స్ వ్యవస్థ వంటి పారదర్శక విధానాలతో ఈ-పంట నమోదు కొనసాగుతోందని చెప్పారు.ప్రస్తుతం ఖరీఫ్-2026లో 1,62,396 మంది రైతులకు చెందిన 4,03,150 ఎకరాల ఈ-పంట నమోదు పూర్తయిందని, 30 రోజుల వయస్సు దాటిన పంటలనే నిబంధనల ప్రకారం నమోదు చేస్తున్నామని వివరించారు. డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా సేకరించిన పంట వివరాలను కేంద్ర ప్రభుత్వం కూడా వినియోగిస్తోందని తెలిపారు.రైతులకు సబ్సిడీలు, బీమా, పెట్టుబడి సాయం వంటి పథకాలు పారదర్శకంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పేర్కొన్నారు. రైతులను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరని, ప్రభుత్వం రైతు సంక్షేమానికే కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.**కొబ్బరి ధరలపై తప్పుడు ప్రచారం చేయొద్దు** కొబ్బరి ధరలపై వస్తున్న తప్పుడు కథనాలను కూడా మంత్రి ఖండించారు. 2025-26లో బంతి కొబ్బరి వెయ్యి కాయలకు రూ.18 వేల నుంచి రూ.27 వేల వరకు, కోప్రాకు రూ.17 వేల నుంచి రూ.28,500 వరకు ధరలు లభించాయని తెలిపారు. ప్రస్తుతం కూడా బంతి కొబ్బరి రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు, కోప్రా రూ.15 వేల నుంచి రూ.24 వేల వరకు విక్రయమవుతోందన్నారు.మార్కెట్ కోలుకుంటున్న సమయంలో నిరాధార కథనాలతో రైతుల్లో భయాందోళనలు సృష్టించడం, మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రయత్నాలు బాధ్యతారాహిత్యమని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు.

## అచ్చతెలుగు కవివర్య 'నాగనార్య'

**• డావ చింతకుంట శివారెడ్డి సహాయ పరిశోధకులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం**




**కడప, మన జనప్రగతి జూలై 03:-** అచ్చ తెలుగు కావ్యాలు, పురాణాలు, చారిత్రక కావ్యాలు, శతకాలు, దండకాలు రచించిన నారు నాగనార్య అచ్చతెలుగు కవివర్య అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డావ చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం శుక్రవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నారు నాగనార్య 124వ జయంతిని నిర్వహించింది. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి నారు నాగనార్య చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం డావ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ నాగనార్య అసలు పేరు నాగయ్య అని, ఆయన ప్రసిద్ధకవులు జనమంచి శేషాద్రిశర్మ, వేదం వేంకటకృష్ణ శర్మల శిష్యుడన్నారు. అన్ని కవితా ప్రక్రియల్లో రచనలు చేసిన ఆయనకు జనమంచి సుబ్రహ్మణ్యశర్మ 'ఆర్య' అనే బిరుదునిచ్చి నాగనార్యగా మార్చారని అన్నారు. ఆయన శతాధిక గ్రంథకర్త అని, ఆయుర్వేద వైద్యంలో కూడా దిట్ట అని, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కారాగార శిక్ష అనుభవించిన గొప్ప దేశభక్తుడని అన్నారు. వై.సి.వి.రెడ్డి లాంటి యువకవులను ప్రోత్సహించి గొప్ప పద్యకవులుగా తయారుచేశారని అన్నారు. అల్లసాని పెద్దన మనుచరిత్రను 'మనువు పుట్టువు' పేరుతో, నంది తిమ్మన పారిజాతాపహరణాన్ని 'మెచ్చుల పచ్చ ముచ్చిలి' అనే పేరుతో అచ్చతెలుగు కావ్యాలుగా రాశారన్నారు. ఆయన పేరుమీద ఆయన మనవడు నారు నాగరాజ, కుటుంబ సభ్యులు ప్రతి ఏటా పురస్కారాన్ని అందజేయడం అభినందనీయమని అన్నారు. గ్రంథపాలకులు ఎన్.రమేష్‌రావు మాట్లాడుతూ నాగనార్య సంస్కృతాంధ్ర భాషల్లో, ఛందో అలంకార శాస్త్రాల్లో నేర్పరి అని అన్నారు. గొప్ప కవులకు చెందిన వారసులు వారి పెద్దలను స్మరించుకుంటూ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల భావితరాలకు వారి సాహితీకృషి అందించినట్లవుతుందన్నారు. లేఖలను కూడా పద్యాల్లో రచించేవారన్నారు. పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సుమతి, శ్రీను, రాణి, అరుణ పాఠకులు సూర్యబాబు, సుబ్బారెడ్డి, శ్రీనాథ్, వరుణ్ నాయక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
04 - 07 - 2026

# ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మళ్లీ వివాదం.ప్రిన్సిపాల్‌పై తల్లిదండ్రుల ఆగ్రహం



**పటాన్ చెరువు మన జనప్రగతి జూలై 03:-**ఇస్నాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రిన్సిపాల్ వ్యవహార శైలిపై విద్యార్థులు, తల్లిదండ్రులు మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులను తరచూ మందలించడం, తల్లిదండ్రులు సమస్యలు వివరించినా స్పందించకపోవడం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారంటూ ఆరోపించారు. ఈ సమస్యలపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని తల్లిదండ్రులు వాపోయారు. గతంలో పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు.తాజాగా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. దీంతో పాఠశాల ఆవరణలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ప్రిన్సిపాల్‌పై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చాయని, ఆ కారణంగా సస్పెన్షన్‌కు గురయ్యారనే ప్రచారం ఉందని కొందరు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అయితే తిరిగి విధుల్లో చేరిన తర్వాత కూడా అదే తరహా వ్యవహార శైలి కొనసాగుతోందని వారు ఆరోపిస్తున్నారు.విద్యార్థుల సంక్షేమం, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, తల్లిదండ్రులతో సానుకూలంగా వ్యవహరించే అంశాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎన్ఎస్ఈ అకాడమీతో నారాయణ ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం



**నెల్లూరు,మన జనప్రగతి జూలై 03:-** విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఎన్ఎస్ఈ అకాడమీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.ఈ ఒప్పందంపై కళాశాల తరపున ఎంబీఏ డీన్ డా. గంగినేని ధనంజయ్, ఎన్ఎస్ఈ అకాడమీ తరపున ముఖ్య కార్యనిర్వాహణ అధికారి డా. అభిలాష్ మిశ్రా సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఈ అకాడమీ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రంగనాథన్ పాల్గొన్నారు.ఈ భాగస్వామ్యంతో కళాశాలలో ఎన్ఎస్ఈ స్మార్ట్ ఫిన్ ల్యాబ్ (ట్రేడింగ్ ల్యాబ్) ఏర్పాటు చేయనున్నారు. ఇందులో రియల్-టైమ్ వర్చువల్ ట్రేడింగ్ సిమ్యులేషన్ ద్వారా విద్యార్థులు ఈక్విటీ, డెరివేటివ్స్, కరెన్సీ మార్కెట్ల పనితీరును ప్రత్యక్షంగా అభ్యసించే అవకాశం ఉంటుంది. వర్చువల్ నిధులతో ట్రేడింగ్ ప్రాక్టీస్ చేయడం ద్వారా పెట్టుబడులు, రిస్క్ మేనేజ్‌మెంట్, మార్కెట్ విశ్లేషణ, ట్రేడింగ్ వ్యూహాలపై అవగాహన పెంపొందించుకోగలరు.అలాగే బ్లాక్‌చైన్, డేటా సైన్స్, బిజినెస్ అనలిటిక్స్, మెషిన్ లెర్నింగ్, ఫైనాన్స్ కోసం పైథాన్ వంటి ఆధునిక అంశాల్లో ప్రత్యేక శిక్షణ అందించనున్నారు.ఈ సందర్భంగా ఎంబీఏ డీన్ డా. గంగినేని ధనంజయ్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు, ప్రత్యక్ష అనుభవం పొందడంతో పాటు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు.కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రవి ప్రసాద్, డైరెక్టర్ డా. దత్తాత్రేయ శర్మ, మేనేజ్‌మెంట్ ప్రతినిధి వై. వినయ్ కుమార్ ఈ అవగాహన ఒప్పందం విద్యార్థుల వృత్తిపరమైన అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# డెంగ్యూ నివారణకు పరిశుభ్రతే శ్రీరామరక్ష

- భాకరాపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన
- ప్రతి శుక్రవారం 'డ్రై డే' పాటించాలని ఆరోగ్య శాఖ సూచన



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 03:-** డెంగ్యూ వ్యతిరేక మహోత్సవాల సందర్భంగా సిద్ధవటం మండలంలోని భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డెంగ్యూ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ, డెంగ్యూ నివారణలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పాత నీటిని తొలగించి తాజా నీటిని మాత్రమే నిల్వ చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని తప్పనిసరిగా పాటించడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని తెలిపారు. అలాగే రాత్రి వేళల్లో దోమతెరలు వినియోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రాహుల్, సూపర్‌వైజర్ డి. రమణయ్య, ఆరోగ్య కార్యకర్త కే. రాణి, ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కే. లక్ష్మీకేసమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకులు

- మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పవన్ సూచన



**సిద్ధవటం, మన జనప్రగతి, జూలై 03:-** తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయడంతో పాటు జనసైనికులు, వీర మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు వెల్లడించారు. పార్టీ బలోపేతానికి నిరంతరం సహకరిస్తున్న రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణకు దేరంగుల శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం చేపట్టాలి

### ప్రతిరోజూ ప్రజలకు సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్



**తిరుపతి మన జనప్రగతి జూలై 03 :-** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, నగర ప్రజలకు ప్రతిరోజూ సురక్షిత తాగునీటి సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల పురోగతి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రాధాన్యత ఆధారంగా త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రతి పనిలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. డ్రైనేజీ కాలువ లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా నగరంలో చెత్త కుప్పలు పేరుకు పోకుండా పారిశుద్ధ్యం మెరుగుపరచాలన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. నగర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ -2026 ప్రాధాన్యతగా తీసుకొని ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పగడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ఇంచార్జి నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీమతి శారదా దేవి వివిధ విభాగాల వారీగా చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, హెల్త్ ఆఫీసర్ డా. యువఅన్వేష్, డీసీ ఓ దేవికుమారి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువారెడ్డి, డి ఈ లు, సానిటరీ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

- అన్నిదానల్లో అన్నదానం మిన్న
- అధ్యక్షులు లయన్ యస్.అంజిరెడ్డి
- అన్నదాత సుఖీభవ... డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్





**అన్నమయ్య ప్రతినిధి మన జన ప్రగతి జులై 03:-** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో గాలివీడు (మం)ప్యారంపల్లి వాస్తవ్యులు ఆవుల హరీష్ రెడ్డి & అశ్విని రెడ్డి దంపతుల 5 వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రేమలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు లయన్ యస్. అంజి రెడ్డి తెలిపారు.అనంతరం దాతలు ఆవుల హరీష్ రెడ్డి& అశ్విని రెడ్డి దంపతులు మాట్లాడుతూ ఈ రోజు మా 5 వ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని మా వంతుగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ రోజు ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,గడ్డం ప్రతాప్ రెడ్డి,ఆశ్రమం మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

# హెచ్‌పీసీఎల్ ఆయిల్ డిపో వద్ద డ్రైవర్లు, హెల్పర్ల ధర్నా

- విశ్రాంతి గదులు, తాగునీరు, టాయిలెట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్
- సమస్యల పరిష్కారానికి యాజమాన్యం హామీ




**సిద్ధవటం మన జనప్రగతి జూలై 03:-** మండలంలోని భాకరాపేట సమీపంలో కడపచెన్నై జాతీయ రహదారిపై ఉన్న హెచ్‌పీసీఎల్ ఆయిల్ డిపో వద్ద డ్రైవర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీయూ అనుబంధ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మకాయల రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ, డ్రైవర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని విమర్శించారు. విశ్రాంతి గదులు, టాయిలెట్లు, బాత్రూమ్‌లు, తాగునీటి వంటి కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలపై ప్రశ్నించిన కార్మికులపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం తగదని హెచ్చరించారు. ధర్నా అనంతరం యాజమాన్యంతో జరిగిన చర్చల్లో డ్రైవర్లు, హెల్పర్ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, విశ్రాంతి గదులు, టాయిలెట్లు, బాత్రూమ్‌లు, తాగునీటి సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం ఆయిల్ ట్యాంకర్ల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ డ్రైవర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి వేమ నారాయణరెడ్డి, ఆర్టీయూ నగర కార్యదర్శి మడగలం ప్రసాద్, రమణ నాయుడు, దస్తగిరి, నాగేంద్ర, మహేంద్ర, వెంకటయ్య, కమల్, రజాక్, ఇమామ్, సుబ్బయ్య, ప్రతాప్ రెడ్డి, మునిరెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మండల ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# నగరంలో విస్తృతంగా డెంగీ నివారణ కార్యక్రమాలు

### - కమిషనర్ పి నరసింహ ప్రసాద్



**చిత్తూరు మన జనప్రగతి జులై 03:-** చిత్తూరు నగరపాలక పరిధిలో డెంగీ నివారణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని కమిషనర్ పి నరసింహ ప్రసాద్ చెప్పారు. డెంగీ నివారణ మాసోత్సవాలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సంతపేట విజయలక్ష్మి కాలనీలోని నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. డెంగీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో అన్ని వార్డుల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి ఫీవర్ సర్వే, లార్వాల గుర్తింపు సర్వే నిర్వహించాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని, లార్వాలను గుర్తించిన ప్రాంతాల్లో అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, నివారణ చర్యలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.పి.లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, స్వర్ణ వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నత స్థానాలకు కాశినాయన ఎంఈఓ నిర్మల & ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరిమళజ్యోతి



**పోరుమామిళ్ల కాశి నాయన, మన జనప్రగతి, జులై 03:-** కాశినాయన మండలంలోని వరికుంట్ల కస్తూర్బా పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానిగాను పదవ తరగతిలో మండల టాపర్ గా నిలిచిన విద్యార్థిని పాలూరి పవిత్రకు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి పరిమళ జ్యోతి 10,116/-ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ముఖ్య అతిధిగా హాజరైన కాశి నాయన మండల విద్యాశాఖ అధికారిని నిర్మల మాట్లాడుతూ... విద్య అనేది మనిషికి నిజమైన ఆభరణము అన్నారు. కష్టపడి చదివితే విద్య ఉన్నత స్థానాలకు చేర్చుతుందని ఉపాధ్యాయిని పరిమళజ్యోతి అన్నారు. మండల టాపర్ పవిత్రను ఎంఈఓ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ఎస్ఓ పాలెం మెర్సి రాణి, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణపై అవగాహన కార్యక్రమం



**అన్నమయ్య జిల్లా ప్రతినిధి మన జనప్రగతి జూలై 03:-** రాయచోటి మండలం సిబ్యాలలో నిర్వహించిన జ్ఞానజ్యోతి నాన్-రెసిడెన్షియల్ డి ఆర్ పి శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, సీడీపీఓ లు, శిక్షణ సిబ్బందికి సైకో సోషల్ కౌన్సిలర్ అత్తర్ ఫీమా అంజుమ్ ఆధ్వర్యంలో మహిళలు మరియు పిల్లలలో ఆత్మహత్యల నివారణ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు .ఈ ఈ సందర్భంగా శుక్రవారం జ్ఞాన జ్యోతి నాన్ రెసిడెన్షియల్ వారు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు, ఒత్తిడి నిర్వహణ, ఆత్మహత్యకు సంబంధించిన హెచ్చరిక సంకేతాలను గుర్తించడం, ఆపదలో ఉన్న వారికి మానసిక బలాన్ని అందించడం, అవసరమైన సమయంలో కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు మరియు నిపుణుల సహాయం తీసుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. టెలి-మనస్ మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ 14416 / 1-800-89-14416, మహిళల హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధికారులు మరియు శిక్షణ సిబ్బంది చురుకుగా పాల్గొని, మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆత్మహత్యల నివారణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేశారు.

# ప్రాణాలు కాపాడేందుకే వేసిన స్పీడ్ బ్రేకర్లే..నేడు ప్రాణాలు తీస్తున్నాయా..?






**• తాళ్లపల్లి ఘోర ప్రమాదం వెనుక భద్రతా లోపాలపై ప్రశ్నలు • సూచిక బోర్డులు, వైట్ లైన్లు, వీధి దీపాలు లేక ప్రమాదాలకు ఆహ్వానం**

**• ప్రమాదం జరిగినా స్పందించని అధికారులు..**

**స్వయంగా రోడ్డును శుభ్రం చేసిన ఆర్టీసీ డ్రైవర్**

**పులివెందుల స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జులై 03:**-కడపపులివెందుల ప్రధాన రహదారిపై రోడ్డు భద్రతా ప్రమాణాలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశంతో నిర్మించిన స్పీడ్ బ్రేకర్లే నేడు సరైన గుర్తింపు సూచికలు లేక ప్రాణాంతకంగా మారుతున్నాయనే ఆందోళన స్థానికులు, వాహనదారుల్లో నెలకొంది.దాదాపు పదేళ్ల క్రితం తాళ్లపల్లి వద్ద ఆర్టీసీ హైర్ బస్సుకు జరిగిన ఘోర ప్రమాదంలో స్కూలుకు వెళ్లే చిన్న పాప ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే కాలక్రమేణా వాటి వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, వైట్ లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో అవే ఇప్పుడు ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.మూడు రోజుల క్రితం అనగా బుధవారం రాత్రి తాళ్లపల్లి వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో వేగంగా వస్తున్న లారీ స్పీడ్ బ్రేకర్‌ను గమనించక అదుపుతప్పి బొరుగుల మిక్చర్ విక్రయిస్తున్న బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మురళీకృష్ణ (50), వెంకటలక్ష్మి (45) దంపతులు అక్కడికక్కడే మృతి చెందగా, వారి కుమార్తె తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలింది. ఘటనపై వేంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే ఈ ప్రమాదం వెనుక లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో పాటు రహదారిపై భద్రతా లోపాలు కూడా కారణమయ్యాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్పీడ్ బ్రేకర్‌కు ముందుగా హెచ్చరిక బోర్డు, రిఫ్లెక్టర్లు, వైట్ లైన్లు ఉంటే ప్రమాద తీవ్రత తగ్గేదని స్థానికులు పేర్కొంటున్నారు. కడపపులివెందుల ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్ల వద్ద గుర్తింపు సూచికలు లేకపోవడం, రోడ్డుకు ఇరువైపులా ఉండాల్సిన భద్రతా ఖాళీ లేకుండా ఇళ్లు, దుకాణాలు నిర్మించబడటం, రాత్రివేళల్లో కనీసం వీధి దీపాలు కూడా లేకపోవడం వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై రోడ్డు భద్రతా నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.**ప్రమాదం జరిగినా కదలని అధికారులు..!** తాళ్లపల్లి వద్ద జరిగిన ప్రమాదం అనంతరం రహదారిపై చెల్లాచెదురుగా పడిన రాతి ముక్కలు, ఇనుప రాడ్లు, గాజు పెంకులు రెండు రోజులపాటు అలాగే ఉండిపోయాయి. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని శుభ్రం చేయడంలో సంబంధిత అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని స్థానికులు విమర్శిస్తున్నారు.శుక్రవారం అదే ప్రాంతంలో ప్రక్కప్రక్కనే వస్తున్న రెండు కార్ల డ్రైవర్లు రహదారిపై ఉన్న ప్రమాదకర వస్తువులను చివరి క్షణంలో గమనించి సడన్ బ్రేకులు వేయడంతో మరో ప్రమాదం తృటిలో తప్పింది. ఈ ఘటనను గమనించిన ఓ సీనియర్ ఆర్టీసీ డ్రైవర్ వెంటనే అక్కడికి చేరుకుని, రహదారిపై చెల్లాచెదురుగా ఉన్న రాతి ముక్కలు, ఇనుప రాడ్లు, గాజు పెంకులను స్వయంగా తొలగిస్తూ క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆయన స్వచ్ఛందంగా ఈ పని చేయడం స్థానికులను ఆకట్టుకుంది. అధికారులు చేయాల్సిన పనిని ఓ ఆర్టీసీ డ్రైవర్ చేయాల్సి రావడం సంబంధిత శాఖల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.**ఇప్పటికైనా మేల్కొంటారా..?**ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్షలు, ప్రకటనలు చేయడం తప్ప ముందస్తు చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ప్రాణాలను కాపాడేందుకు నిర్మించిన స్పీడ్ బ్రేకర్లే నేడు సరైన నిర్వహణ లేక ప్రాణాలు తీసే పరిస్థితికి చేరుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు, వైట్ లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ప్రమాదం జరిగిన వెంటనే రహదారిని పూర్తిగా శుభ్రం చేసి వాహనదారుల భద్రతకు ప్రాధా న్యం ఇవ్వాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా మరిన్ని అమాయక ప్రాణాలు బలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..

# వైద్యం వికటించి చిన్నారి మృతి




**వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబం ఆందోళన**

**మృతదేహంతో ఆసుపత్రి ఎదుట అర్ధరాత్రి ధర్నా**

**విచారణకు హామీ ఇచ్చిన పోలీసులు**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 03:-** పులివెందుల పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన 11 ఏళ్ల చిన్నారి మృతి తీవ్ర విషాదానికి దారితీసింది.వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ,మృతదేహంతో ఆసుపత్రి ఎదుట అర్ధరాత్రి ఆందోళనకు దిగారు.ఈ ఘటన పట్టణంలో తీవ్ర కలకలం రేపింది.పట్టణంలోని క్రిస్టియన్ లైన్‌కు చెందిన ప్రేమ్ కుమార్, తులసి దంపతుల కుమార్తె మోక్షిత (11) గురువారం మధ్యాహ్నం కడుపు నొప్పితో బాధపడుతుండటంతో మొదట మారుతి ఆసుపత్రికి తీసుకెళ్లారు.అక్కడ పరీక్షించిన వైద్యులు అపెండిక్స్ శస్త్రచికిత్స అత్యవసరమని,తమ వద్ద సదుపాయాలు లేవని చెబుతూ రిమ్స్‌కు లేదా పులివెందులలోని పుల్లారెడ్డి ఆసుపత్రికి వెళ్లాలని సూచించినట్లు చిన్నారి తండ్రి తెలిపారు.అనంతరం వారు పుల్లారెడ్డి ఆసుపత్రికి చేరుకున్నారు.అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ థియేటర్‌కు తరలించారని, కొద్దిసేపటికే మరో ఇద్దరు వైద్యులు అక్కడికి రావడంతో తమకు అనుమానం కలిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు.అనంతరం డాక్టర్ బయటకు వచ్చి చిన్నారి పల్స్ రేటు చాలా తక్కువగా ఉందని,వెంటనే కడపలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాలని సూచించినట్లు తెలిపారు.అయితే,రెఫర్ చేసే సమయంలో చికిత్సకు సంబంధించిన ఎలాంటి రిపోర్టులు,వైద్య వివరాలు ఇవ్వకుండా మేము ఫోన్‌లో సమాచారం అందిస్తాం.మీరు వెంటనే వెళ్లండి అని మాత్రమే చెప్పారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.తీవ్ర ఆందోళన మధ్య చిన్నారిని కడపకు తరలించగా,అక్కడికి చేరుకున్న గంట తర్వాత చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని తెలిపారు.వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు,బంధువులు మృతదేహంతో పుల్లారెడ్డి ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విషయం తెలుసుకున్న టీడీపీ నేత,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుం బాన్ని పరామర్శిం చారు.ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవా లని అధికారులను కోరారు.సమాచారం అందుకున్న పులివెందుల సీఐ శ్రీరామ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు.ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి,చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించారు.

# కడప స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన

**• సీఎం చంద్రబాబును కలిసిన బీటెక్ రవి,మారెడ్డి జోగిరెడ్డి**




**జమ్మలమడుగు మన జనప్రగతి జులై 03:**కడప జిల్లా పారిశ్రామిక రంగానికి సరికొత్త ఊపునిచ్చే చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. జమ్మలమడుగు మండలం సున్నాపురాళ్లపల్లె గ్రామంలో ప్రతిష్టాత్మక కడప స్టీల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని నేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.స్టీల్ ఫ్యాక్టరీ శంకుస్థాపన ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సీఎంను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా రాజకీయ,అభివృద్ధి అంశాలపై చర్చించారు.అదేవిధంగా,తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి కూడా ముఖ్యమంత్రిని కలిసి అభివాదం చేశారు.జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల ప్రగతిని ఈ సందర్భంగా సీఎంకు వివరించారు.ఈ సందర్భంగా నేతలు స్పందిస్తూ కడప జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి ఈ స్టీల్ ఫ్యాక్టరీ ఒక సువర్ణ అధ్యాయమని కొనియాడారు.ఈ మెగా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతంలో, ముఖ్యంగా కడప జిల్లాలో వేలాది మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఆర్థికాభివృద్ధికి ఈ ఫ్యాక్టరీ కొత్త ఊపునిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న స్టీల్ ప్లాంట్ కల నిజం కాబోతుండటం పట్ల కడప జిల్లా ప్రజలు,పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్‌గా జేబి శ్రీనివాస్

**• పార్టీకి విధేయతతో ఉండటంతో జెబీకి వరించిన పదవి**



**తిరుపతి మన జనప్రగతి జులై 03:-** తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జిగా మన్నెం శ్రీనివాస్ ( జేబి శ్రీనివాస్ ) ను నియమిస్తూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగుదేశం పార్టీలో జేబీ శ్రీనివాస్ రెండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పార్టీ అధిష్టానం ఆదేశాలను పాటిస్తూ తిరుపతిలో ఆయన ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం చేపట్టిన విజయవంతం చేయడంలో సఫలీకృతులయ్యారు. జేబీ శ్రీనివాస్ టిడిపి కి మొదట్నుంచి విధేయతగా ఉండటం ఆయనకు కలసి వచ్చింది. 2024 ఎన్నికలలో తిరుపతి ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించడంతో పార్టీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు గెలుపు కోసం తన వంతుగా శక్తివంచన లేకుండా కృషిచేసి తనకు కేటాయించిన క్లస్టర్లలో జనసేన పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేశారు. రాబోయే రోజులలో జేబీ శ్రీనివాస్ సేవలను తెలుగుదేశం పార్టీ మరింతగా ఉపయోగించుకు నేందుకు గుర్తించి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు వయసు పై పడటంతో ఆమెను తప్పించి యువకుడు అయినా జేబీ శ్రీనివాస్ కు తిరుపతి ఇన్చార్జి బాధ్యతలను అప్పగించారు. తిరుపతి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకుల్లో, కార్యకర్తలు అందరూ ఇన్చార్జ్ ని మారుస్తారనే ప్రచారం ఏడాదిన్నరగా కొనసాగుతూ వస్తూ ఉండేది. చంద్రబాబు నాయుడు తిరుపతి నియోజకవర్గానికి సమన్వయ కమిటీని నియమిస్తారు అనే ప్రచారం కూడా జరిగింది. ఏది ఏమైనా ఎట్టకేలకు జేబీ శ్రీనివాస్ ఇన్చార్జిగా నియమించడంతో తెలుగుదేశం పార్టీ నాయకులు, జేబీ శ్రీనివాస్ అనుచరులు, యువత, టిడిపి కార్యకర్తలు నగరంలో సంబరాలు జరుపుకున్నారు. అందుబాటులో ఉన్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు మరి కొంతమంది ముఖ్య నేతలను జేబీ శ్రీనివాస్ స్వయంగా వెళ్లి వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. టిడిపి తో పాటు బిజెపి, జనసేన నాయకులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు స్వయంగా వెళ్లి జెబి శ్రీనివాస్ ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. **ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కొనే దిట్టైన నేత జేబి...** తిరుపతి నియోజకవర్గంలో వైఎస్సార్సీపీ లాంటి ప్రతిపక్ష పార్టీ నాయకులను ఎదుర్కోవాలంటే దీటైన వ్యక్తి జేబీ శ్రీనివాస్ అని మొదట పార్టీ అధిష్టానం గుర్తించింది. స్థానికంగా ఉన్నా తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా మొదట్నుంచి చెబుతూ వచ్చారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తో పాటు జిల్లాలోని మిగిలిన ప్రతిపక్ష పార్టీ నాయకులను ఎదుర్కోవడంలో వ్యూహాలు రచించడంలో జేబీ శ్రీనివాస్ కు రాజకీయంగా మంచి పట్టు ఉంది అని చెప్పవచ్చు.

# ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలి: ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 03:-**రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు,పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు నిరసించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం పులివెందులలోని తన కార్యాలయంలో ఆయన 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఆయన స్వయంగా వినతులను స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా చర్చించి,వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపారు.హామీల అమలులో అలసత్వం ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందని విమర్శించారు. పేద ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను దూరం చేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఆరోపించారు.ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంతో పాటు,ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో వైకాపా స్థానిక నాయకులు,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

# అతి వేగంగా దూసుకెళ్లిన కారు

**- గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు**



**రైల్వే కోడూరు మన జనప్రగతి జూలై 03:-** అతి వేగంగా వెళ్తున్న కారు వ్యక్తిపై దూసుకెళ్లి ఢీకొని, అనంతరం బాధితుడి తలపై నుంచి వెళ్లడంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం, కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అధిక వేగంతో వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కూడా గాయపడిన వ్యక్తిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు సహకరించినట్లు సమాచారం.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# ప్రముఖ సంస్థలతో ఉక్కు రాష్ట్రంగా ఏపీ

**• జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం • 2028లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి • కియా అభివృద్ధికి... బ్రాహ్మణీ స్టీల్స్ అవినీతికి నిదర్శనం • అనంత నుంచి 90 దేశాలకు కియా కార్ల ఎగుమతి • బ్రాహ్మణీ స్టీల్స్ పేరుతో ఐరన్ ఓర్ దోపిడీ, విదేశాలకు స్మగ్లింగ్ • సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు • జేఎస్‌డబ్ల్యూ నియోఎనర్జీ, విజయనగరంలో పారిశ్రామిక ప్లాంట్‌కు శంకుస్థాపన**










**కడప ప్రతినిధి మన జనప్రగతి జూలై 03:** పరిశ్రమలు, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌తో రాయలసీమకు నవశకం ప్రారంభమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం సహా, ఆర్సెల్లార్ మిట్టల్, వైజాగ్ స్టీల్‌తో ఆంధ్రప్రదేశ్ ఉక్కు రాష్ట్రంగా మారుతుందని ఆయన అన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపు రాళ్ల పల్లిలో జిందాల్ సౌత్ వెస్ట్ రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. జేఎస్‌డబ్ల్యూ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మలతో కలిసి సీఎం ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టారు. రాయల సీమ స్టీల్ ప్లాంట్‌తో పాటు అనుబంధంగా నిర్మిస్తున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు పనులూ సీఎం ప్రారంభించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో రూ.16,350 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కానుంది. ఉక్కు ఉత్పత్తి, సోలార్ ప్రాజెక్టు ద్వారా 2,700 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. 3,850 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేసేలా నియో ఎనర్జీ సోలార్ క్యాప్టివ్ పవర్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. రూ.20,350 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. జమ్మలమడుగు నుంచి విజయనగరం జిల్లాలోని జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కును కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. విజయనగరం జిల్లాలో 1,166 ఎకరాల్లో అత్యాధునిక పారిశ్రామిక పార్కును జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం రూ.531 కోట్లను జిందాల్ సంస్థ పెట్టుబడిగా పెట్టనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

**దశాబ్దల నిరీక్షణ నిజమైంది** రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనుల్ని ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. సీఎం మాట్లాడుతూ.."రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం గురించి దశాబ్ద కాలం పాటు ఎదురు చూశాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ హామీ నెరవేరింది. రాయలసీమ అంటే ఇప్పుడు హార్టికల్చర్, అరుదైన ఖనిజాలు, స్వర్ణగిరి గోల్డ్ ఫీల్డ్–రాయల్ ఎన్ ఫీల్డ్. కియాకార్లు, హీరో బైక్స్ , డ్రోన్లు, ఫైటర్ జెట్లు, ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీ. సీమ ఇకపై ఏమాత్రం కరువు నేల కాదు, జలకళ ఉట్టిపడే పచ్చని ప్రాంతం. పరిశ్రమలు, రాయలసీమ స్టీల్ ప్లాంట్‌తో ఓ నవ శకం మొదలైంది. విభజన తర్వాత ఎన్నో అవాంతరాలు, అడ్డంకులు, అనుమానాలు దాటుకుని రాయలసీమ స్టీల్ ప్లాంట్ పనులు ప్రారంభించాం. గత పాలకులు మోసపూరితంగా శంకుస్థాపనలు చేశారు. 2019లో ఓసారి, 2023లో మరోమారు శంకుస్థాపన, భూమి పూజలు చేశారు. ఐదేళ్ల కాలంలో శంకుస్థాపనలు తప్ప ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాంట్ పనులకు శ్రీకారం చుట్టాం. పూర్తిగా గ్రీన్ ఎనర్జీతో ఉక్కు ఉత్పత్తి చేస్తారు. విశాఖ ఉక్కు సంక్షోభంలో ఉన్నప్పుడు కేంద్రంతో మాట్లాడి రూ.11,440 కోట్ల ఆర్థిక సాయంతో ఆదుకున్నాం. అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ రూ.1.35 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. జేఎస్‌డబ్ల్యూ బళ్లారి ప్లాంట్ కంటే అధిక సామర్థ్యంతో రాయలసీమ ప్లాంట్‌ను తీర్చిదిద్దాలి. గండికోట నుంచి 15 కిలోమీటర్ల మేర పైప్ లైన్ వేసి 2 టీఎంసీల నీటిని స్టీల్ ప్లాంట్ కు సరఫరా చేస్తాం. రాయలసీమ ప్రాంతంలో ఉన్న అత్యంత నాణ్యమైన ముడి ఇనుము ఖనిజాన్ని కూడా ప్లాంట్ కు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**గత పాలనలో రాయలసీమ నష్టపోయింది** రాయలసీమ ఎవరి వల్ల నష్ట పోయిందో ప్రజలు గుర్తించాలని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. "దేశవ్యాప్తంగా పోటీ ఉన్నా 2017లో అనంతపురం జిల్లాకు కియా కార్ల పరిశ్రమను తీసుకువచ్చాం. 536 ఎకరాలను కేటాయించి, నీళ్లు ఇచ్చి ఉత్పత్తికి అన్ని విధాలా సహకరించాం. మేం తెచ్చిన కియా కంపెనీ 19 లక్షల కార్లు ఉత్పత్తి చేసింది. ఇందులో 3 లక్షల కార్లు 90 దేశాలకు పైగా ఎగుమతి అయ్యాయి. కియాతో అనంతపురం దశదిశా మారింది. గతంలో కొందరు స్వార్థపరులు కేవలం సొంత ప్రయోజనాల కోసమే పనిచేసి అక్రమాలు చేశారు. 2007లో 14 వేల ఎకరాలను బ్రహ్మణీ స్టీల్స్ కు భూములు ఇచ్చి భ్రమలు కల్పించారు. ఎయిర్ పోర్టు కడతామని అన్నారు. ఇప్పటి వరకూ అతీగతి లేదు. క్యాప్టివ్ మైనింగ్ అని చెప్పి ఓబుళాపురం గనుల నుంచి దోపిడీ చేశారు. ముడి ఇనుము ఖనిజాన్ని విదేశాలకు స్మగ్లింగ్ చేశారు. అసలు ప్లాంటే పెట్టలేదు. దేశానికి ఉపయోగపడాల్సిన సంపద విదేశాలకు తరలిపోయింది. తప్పు చేసిన వ్యక్తులు జైలుకు వెళ్లారు. ఈ ఒక్క ఉదాహరణతోనే ఎవరిది విశ్వసనీయతో, ఎవరు మోసగాళ్లో అర్థం అవుతుంది. రాయలసీమ సంపద ఈ ప్రాంత అభివృద్ధికే ఉపయోగపడాలి. ఇక్కడి ముడి ఇనుముతో ఇక్కడే ఉక్కు తయారు కావాలి. రాష్ట్రానికి చెందిన యువత ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే ఉద్యోగాలు కల్పిస్తాం. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి కడప జిల్లాకు, రాయలసీమకు ఏమీ చేయలేదు." అని సీఎం అన్నారు.

**విశ్వసనీయత లేని పార్టీకి విలువెక్కడ..?** 'గత పాలకులు రాయలసీమలో ఒక్క ఎకరాకూ నీళ్లు ఇవ్వలేక పోయారు. గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరలోనే ఇస్తాం. సాగునీరు, తాగునీటి అవసరాలు తీరుస్తాం. అవుకు టన్నెల్ పూర్తి చేసి పులివెందులలో చీని తోటలు కాపాడాం. ఎర్రబెల్లి చెరువుకు నీళ్లు ఇచ్చి రైతుల కష్టాలు తీర్చాం. సీమలో స్పేస్, ఏరో స్పేస్, డిఫెన్సు, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, రెన్యూవబుల్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయి. స్పేస్ సిటీలో, డ్రోన్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు జేఎస్‌డబ్ల్యూ ముందుకు వచ్చింది. నమ్మకంతో, విశ్వాసంతో పాలన అందిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానంతో ఆటలు ఆడుకోవద్దని చెబుతున్నాను. గత పాలనలో మన రాజధాని ఏమిటో ఎక్కడుందో కూడా చెప్పలేని పరిస్థితి. వారికి విశ్వసనీయతే లేదు. నిన్న మావిగన్ అన్నారు. నేడు విజయవాడ అంటున్నారు. మతిస్థిమితం లేని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని, ప్రజల్ని తీవ్రంగా నష్ట పరిచారు. ప్రజలంతా కాలరెత్తుకుని చెప్పుకునేలా అమరావతిని అభివృద్ధి చేస్తాం. హింస, నేరాలతో కాదు.. ప్రజల కోసం బాధ్యతగా రాజకీయాలు చేయాలి. విజయవాడ యువకుడి అదృశ్యం ఘటనను కూడా రాజకీయం చేసేలా వైసీపీ వ్యవహరిస్తోంది. పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉన్నారు. విధ్వంసమే గొడ్డలి పార్టీకి అజెండా. గంజాయి బ్యాచ్ విషయంలో కఠినంగా ఉండాలని ఆదేశించాను. మా హయాంలో శాంతిభద్రతలకే పెద్ద పీట. అలాగే, హార్టీకల్చర్ సాగుతో లింగాల మండలంలో రాష్ట్రంలోనే అత్యధిక తలసరి ఆదాయం వస్తోంది. ఆగస్టు 15 నాటికి గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్‌కు మదనపల్లిలో శంకుస్థాపన చేస్తాం. రాయలసీమ హార్టీకల్చర్ హబ్ కోసం పూర్వోదయ పథకం కింద రూ.40 వేల కోట్లు వ్యయం చేస్తాం. ప్రైవేటు రంగం నుంచి మరో రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి. అమెరికాలో ఉన్న గ్రాండ్ కాన్యాన్‌కు ధీటుగా మన గండికోటను అభివృద్ధి చేస్తాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

**విజనరీ నేతతో పనిచేయటం గౌరవం- సజ్జన్ జిందాల్** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంటి విజన్ ఉన్న నాయకులు దేశంలో చాలా అరుదుగా ఉన్నారని జిందాల్ సౌత్ వెస్ట్ లిమిటెడ్ చైర్మన్, సీఎండీ సజ్జన్ జిందాల్ అన్నారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్, నియో ఎనర్జీ ప్లాంట్, విజయనగరం పారిశ్రామిక పార్కు పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చే 25 ఏళ్లలో చేయాల్సిన పనుల గురించి చంద్రబాబు ముందుచూపుతో ఆలోచన చేస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధి కోసం నిత్యం పనిచేసే చంద్రబాబు లాంటి నేతలతో కలిసి పనిచేయటం పారిశ్రామిక వేత్తగా తనకు గౌరవమని ఆయన వ్యాఖ్యానించారు. ఏడాదికి 2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నిర్మితం అవుతున్న రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను మరింతగా విస్తరిస్తామని తెలిపారు. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో స్థానిక యువతీ యువకులకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ తరపున దాదాపు రూ.50 వేల కోట్ల మేర ఏపీలో పెట్టుబడులు పెడతామని.. ఈ పెట్టుబడులతో 50 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. అంతకుముందు స్టీల్ ప్లాంట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను, మినియేచర్ మోడళ్లను ముఖ్యమంత్రి ఆసక్తిగా తిలకించారు. విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న జేఎస్‌డబ్ల్యూ పారిశ్రామిక పార్కు గురించి సజ్జన్ జిందాల్ సీఎంకు వివరించారు. దీని సమీపంలో పర్యాటక రిసార్టును ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ ప్లాంట్ లో తమ సంస్థ రూపొందించిన డిఫెన్స్ డ్రోన్ షీల్డ్ ఏఐ గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి తిరుపతి స్పేస్ సిటీ సహా కర్నూలు డ్రోన్ సిటీలో వసతులను వినియోగించుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తులు, డిఫెన్స్ అవసరాల కోసం వినియోగించే ప్రత్యేక వాహనాన్ని జిందాల్‌తో కలిసి సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

---




## డెంగ్యూ వ్యతిరేకమాసోత్సవం ప్రజలుకు, విద్యార్థులుకు అవగాహన

**- ఫ్రైడే డ్రై డే మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్**

**పీలేరు మన జనప్రగతి జూలై 03:**–పీలేరు మండలంకోళ్లపారం కాలనీ, డాక్టర్ బి.యర్ అంబేద్కర్ గురుకులంలో డెంగ్యూవ్యతిరేకమాసోత్సవంలో భాగంగా శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో కోళ్ల పారం కాలనీలో గ్రామస్తులుకు డెంగ్యూ జ్వరాలుఏ దోమలు కుడితే వస్తాయి, అవి ఎక్కడ ఎలా ఉత్పత్తి అవుతాయి వాటి దశలు ఎమిటీ ఏ సమయంలో కుడుతాయి, మలేరియా టైపాయిడ్ కలరా చికెన్ గున్యా లాంటిజ్వరాలు,దోమలు గురించి అవగాహన కల్పించి లార్వ దశనీటిలో ఎలా ఉంటాయిడెమో ద్వారా చూపించారు. ఎక్కువ రోజులు నిల్వ వున్న నీటిని వాడరాదని నీటిని తొట్లు డ్రమ్ములు నుండి కింద పడేశారు.అనంతరం డాక్టర్ బి.యర్ అంబేద్కర్ గురుకులంలోని సుమారు 480మంది విద్యార్థులుకు ఉపాధ్యాయునిలకుఅవగాహన కల్పించారు.ఈ సందర్భంగాఅయన మాట్లాతూ డెంగ్యూ, సీజనల్ జ్వరాలు పట్ల, దోమలు వాటి దశలు,దోమకాటువల్ల ఏయే దోమ వల్ల ఏయే జ్వరాలు వస్తాయి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన ర్యాలీ,నిర్వహించారు. విద్యార్థులు చేతమన ఆరోగ్యం మనచేతిలోమన పంతం దోమలు అంతంలాంటి నినాదాలు, ప్రతీజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా కోఆర్డినేటర్ అదికారిని పద్మజ పాల్గొన్నారు.ఈసందర్బంగా ఆమె మాట్లాతూ విద్యార్థులు యొక్క ఆరోగ్యం గురించి విద్య సౌకర్యాలు భోధన, వసతి, తరగతి గదులు, వంట శాల గురించి అడిగి తెలుకొని విద్యార్థులు శ్రద్ధ తో చదువుకొనీ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్ర కళ, ఉపాధ్యాయనిలు, స్టాఫ్ నర్స్ ప్రమీల, ఆరోగ్య కార్యకర్తలు శివ ప్రసాద్, మనోహర్, వెంకటరమణ, చిన్న రెడ్డప్ప, వెంకట రత్నం, అయేషా, ఆశ లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం









**• ఆక్రమణల పాలవుతున్న ఆలయ భూములు • రావులకొలనులో శిథిలావస్థకు చేరిన ఆలయాలు**

**• 93 ఎకరాల దేవాదాయ భూమిపై పట్టింపు కరవు**

**సింహాద్రిపురం మన జనప్రగతి జూలై 03:** సింహాద్రిపురంమండల పరిధిలోని రావులకొలను గ్రామంలో దేవాదాయ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామంలోని శ్రీ భోగేశ్వరస్వామి,గండి ఆంజనేయస్వామి, పెద్దమ్మ ఆలయాలకు సంబంధించి సుమారు 93 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నప్పటికీ అధికారుల ఉదాసీనత వల్ల అవి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు.అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఈ విలువైన ఆలయ భూములను గ్రామంలోని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా ఆక్రమించుకుని వ్యవసాయానికి ఉపయోగించుకుంటున్నారు. మరికొన్ని భూములు సాగుకు నోచుకోక బంజరు భూములుగా మారిపోయాయి.భూములు ఆక్రమణల పాలుకావడం,అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆలయాలకు రావాల్సిన ఆదాయం పూర్తిగా నిలిచిపోయింది.దీంతో నిత్య ధూపదీప నైవేద్యాలు లేక ఆలయాలు శిథిలావస్థకు చేరి, కేవలం బండరాళ్లుగా మిగిలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఆక్రమణకు గురైన 93 ఎకరాల ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఆ భూములను పారదర్శకంగా వేలం వేసి,తద్వారా వచ్చే ఆదాయంతో ఆలయాలను పునరుద్ధరించి,ధూపదీప నైవేద్యాలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
నిజం మా ధర్మం | వార్త మా వంతు | అభివృద్ధి మా లక్ష్యం
04 - 07 - 2026

# రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి నాంది

## జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం

### రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం

### రూ.16,350 కోట్ల పెట్టుబడి తో రెండు దశల్లో 20 లక్షల టన్నుల సామర్థ్యంతో నిర్మాణం కానున్న ఉక్కు కర్మాగారం













**జమ్మలమడుగు మన జనప్రగతి జూలై 03:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థ.. వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని సున్నపురాళ్లపల్లె వద్ద.. రాయలసీమ సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మాణ పనులను నాంది పలికింది. శుక్రవారంరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ళపల్లె వద్ద ఈ బృహత్తరమైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు,పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ,జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ జయంత్ ఆచార్య,జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.సవిత,రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్,రాష్ట్ర పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డా. యువరాజ్,జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,రాష్ట్ర ప్రభుత్వ విప్,జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణ రెడ్డి,పజా ప్రతినిధులు, పాల్గొన్నారు.రెండు దశల్లో రూ.16,350 కోట్ల పెట్టుబడిజేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూర్తిగా అనుబంధ సంస్థగా ఈ ప్రాజెక్టు అమలవుతోంది. మొత్తం 20 లక్షల టన్నుల (2 మీటా) వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని రెండు దశల్లో నిర్మించనున్నారు.మొదటి దశలో రూ.4,500 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 10 లక్షల టన్నుల సామర్థ్యమున్న సమీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారు.రెండో దశలో మరో రూ.11,850 కోట్ల పెట్టుబడితో సామర్థ్యాన్ని 20 లక్షల టన్నులకు పెంచనున్నారు.దీంతో మొత్తం పెట్టుబడి వ్యయం రూ.16,350 కోట్లకు చేరనుంది.అత్యాధునిక సాంకేతికతతో పర్యావరణహిత ఉత్పత్తి ఈ ప్రాజెక్టులో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఆర్క్ ఫర్నెస్ సాంకేతికతను వినియోగించనున్నారు. పునర్వినియోగ ఉక్కు స్క్రాప్, డైరెక్ట్ రిడ్యూస్డ్ ఐరన్‌ను ముడి పదార్థాలుగా ఉపయోగించి తక్కువ కార్బన్ ఉద్గారాలతో అత్యుత్తమ నిర్మాణ ఉక్కును తయారు చేయనున్నారు. పునరుత్పాదక విద్యుత్ వినియోగం, ఇంధన పొదుపు సాంకేతికతలు, వనరుల సమర్థ వినియోగం ద్వారా దేశంలోనే అత్యంత సుస్థిర ఉక్కు తయారీ కేంద్రాల్లో ఒకటిగా ఈ కర్మాగారాన్ని తీర్చిదిద్దనున్నారు.**రాయలసీమకు పారిశ్రామికంగా భారీ ఊతం** ఈ ప్రాజెక్టు ద్వారా రహదారి, రైల్వే, విద్యుత్, నీటి వసతులు మరింత అభివృద్ధి చెందనున్నాయి. అనుబంధ పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. రాయలసీమను పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇది బలమైన పునాదిగా మారనుంది.**రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం పై జేఎస్‌డబ్ల్యూ ప్రశంసలు** రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుపై జేఎస్‌డబ్ల్యూ నమ్మకానికి నిదర్శనమని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో తయారీ రంగం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కొనియాడారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక సామర్థ్యాల నిర్మాణంలో భాగస్వాములు కావడం తమకు గర్వకారణమని తెలిపారు.**దేశ ఉక్కు రంగానికి కొత్త బలం** తయారీ, మౌలిక సదుపాయాల విస్తరణలో భారతదేశం కీలక దశలో ఉందని, ఆంధ్రప్రదేశ్ ఈ అభివృద్ధికి కేంద్రబిందువుగా మారుతోందని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ & సీఈఓ జయంత్ ఆచార్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. **జేఎస్‌డబ్ల్యూ లక్ష్యం సుస్థిర అభివృద్ధి** 2030 నాటికి ఉక్కు తయారీ కేంద్రాల్లో కార్బన్ ఉద్గారాలను 42 శాతం తగ్గించడం, 2050 నాటికి నికర కార్బన్ తటస్థత సాధించడం జేఎస్‌డబ్ల్యూ లక్ష్యంగా పెట్టుకుంది. జీవవైవిధ్య పరిరక్షణ, నీటి వినియోగ నియంత్రణ, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వంటి పర్యావరణ ప్రమాణాలను ఈ ప్రాజెక్టులో అమలు చేయనుంది. **రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో మరో మైలురాయి** రాయలసీమ స్టీల్ ప్రాజెక్టు ప్రారంభం కేవలం ఒక కర్మాగార నిర్మాణానికి మాత్రమే కాకుండా, రాయలసీమను జాతీయ పారిశ్రామిక పటంలో మరింత బలంగా నిలబెట్టే కీలక అడుగుగా నిలవనుంది.భారీ పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, పర్యావరణహిత ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధితో ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పురోగతిలో ఒక మైలురాయిగా నిలుస్తుందనడంలో.. ఈ శంకుస్థాపన ఘట్టం ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.ఈ కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,జేసీ డా. నిధీమీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, కమలాపురం,మైదుకూరు ఎమ్మెల్యేలు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్,నాయకులు పి వి ఎన్ మాధవ్,భూపేష్ రెడ్డి సంబందిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాయలసీమ ఇకపై కరువు నేల కాదు

### దశాబ్దకాలంగా ఎదురుచూసిన రాయలసీమ స్టీల్ ప్లాంట్ కల కూటమి ప్రభుత్వ హయాంలో సాకారమవుతోందన్నాది

### రూ.16,350 కోట్ల పెట్టుబడితో 1,100 ఎకరాల్లో రెండు దశల్లో ప్లాంట్‌ను ఏర్పాటు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు




**జమ్మలమడుగు మన జనప్రగతి జూలై 03:-** రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, దశాబ్దకాలంగా ఎదురుచూసిన రాయలసీమ స్టీల్ ప్లాంట్ కల కూటమి ప్రభుత్వ హయాంలో సాకారమవుతోందన్నారు. రూ.16,350 కోట్ల పెట్టుబడితో 1,100 ఎకరాల్లో రెండు దశల్లో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలి దశలో రూ.4,500 కోట్లు, రెండో దశలో రూ.11,850 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌తో పాటు జేఎస్‌డబ్ల్యూ గ్రీన్ ఎనర్జీ ఆధారిత సోలార్ క్యాప్టివ్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేస్తోందని, వ్యర్థాల నుంచి సేకరించిన ఇనుముతో ఉక్కు ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు.రాయలసీమ ఇకపై కరువు నేల కాదని, హార్టికల్చర్, ఖనిజ సంపద, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ వంటి రంగాలకు కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని సీఎం అన్నారు. గండికోట నుంచి 15 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా ప్లాంట్‌కు 2 టీఎంసీల నీటిని అందించడంతో పాటు రోడ్డు, రైలు, పోర్టు కనెక్టివిటీ కల్పిస్తామని తెలిపారు. రాయలసీమలో లభించే నాణ్యమైన ఇనుప ఖనిజంతో ఇక్కడే ఉక్కు తయారీ జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.గత ప్రభుత్వాలు శంకుస్థాపనలకే పరిమితమయ్యాయని, 2019, 2023లో భూమిపూజలు చేసినా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు. గత రెండేళ్లలో అనుమతులు, ఇతర అంశాలను పరిష్కరించి జేఎస్‌డబ్ల్యూను ఒప్పించి పనులు ప్రారంభించామని, మరో రెండేళ్లలోనే ఉత్పత్తి కూడా ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు.కియా పరిశ్రమతో అనంతపురం రూపురేఖలు మారిపోయాయని గుర్తుచేసిన సీఎం, గతంలో బ్రహ్మణీ స్టీల్స్ పేరుతో వేల ఎకరాల భూములు కేటాయించి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఓబులాపురం గనుల పేరుతో అక్రమ తవ్వకాలు, స్మగ్లింగ్ జరిగి రాష్ట్ర సంపద విదేశాలకు తరలిపోయిందన్నారు. ఇకపై రాయలసీమ సంపద రాయలసీమ అభివృద్ధికే వినియోగిస్తామని, స్థానిక యువతకు స్థానికంగానే ఉద్యోగాలు కల్పించేలా పరిశ్రమలను తీసుకొస్తామని తెలిపారు.రాష్ట్రానికి ఇప్పటికే రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వాటి ద్వారా సుమారు 9 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తిరుపతి జిల్లాలో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ ఏర్పాటుకు కూడా జేఎస్‌డబ్ల్యూ ముందుకొచ్చిందన్నారు. ఆగస్టు 15న మదనపల్లిలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన చేస్తామని, ప్రభుత్వ రంగం నుంచి రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ రంగం నుంచి రూ.60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గండికోటను అమెరికాలోని గ్రాండ్ కాన్యాన్ తరహాలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.రాజకీయ అంశాలపై స్పందిస్తూ, గత ఐదేళ్ల పాలనలో రాయలసీమకు, కడప జిల్లాకు న్యాయం జరగలేదని విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నష్టపరిచారని, అమరావతిని ప్రజలు గర్వపడే రాజధానిగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామని తెలిపారు. విజయవాడ యువకుడి అదృశ్యం ఘటనను కూడా రాజకీయాలకు ఉపయోగించుకోవడం సరికాదని వ్యాఖ్యానించారు.

# న్యాయవాదుల రక్షణ చట్టం వచ్చేవరకు పోరాటం

- న్యాయవ్యవస్థ బలోపేతానికే రక్షణ చట్టం
- ముసాయిదా బిల్లును తక్షణ విడుదల చేయాలని డిమాండ్
- ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని న్యాయవాదుల ధర్నా




**అన్నమయ్య ప్రతినిధి మన జనప్రగతి జూలై 03:-** న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చేవరకు పోరాటం జరుగుతూనే ఉంటుందని భారత న్యాయవాదుల సంఘం కడప- అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్ అన్నారు. రాయచోటి ఐఏఎల్ కమిటీ అధ్యక్షుడు యు.ధనుంజయ్ కుమార్ ప్రధాన కార్యదర్శి ఖాదర్బాషా నేతృత్వంలో భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కోర్టు గేటు ఎదుట ధర్నా జరిగింది. ధర్నాను ఉద్దేశించి కడప ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐ ఏ ఎల్ చేసిన ఉద్యమ ఫలితంగా రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటికే న్యాయవాదుల పరిరక్షణ చట్టం అమలులోనికి వచ్చిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తక్షణం ముసాయిదా బిల్లును తయారుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం అసెంబ్లీలోను, పెద్దల సభలోనూ ప్రభుత్వం ఆమోదం తెలిపిన అంతవరకు ఐఏఎల్ పోరాటం కొనసాగుతుందని ఈశ్వర్ అన్నారు. న్యాయవాదులకు రక్షణ చట్టం లేకపోవడం వలన వృత్తిపరమైన సమస్యలు ఎన్నో ఎదురవుతున్నాయని రక్షణ చట్టం వాటికి పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. రాయచోటి ఐఏఎల్ ప్రధాన కార్యదర్శి మిఠాయిగిరి ఖాదర్ బాషా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ ప్రధానమైన మూల స్తంభం అని న్యాయవాదుల రక్షణ చట్టం చేయడం వలన న్యాయవ్యవస్థ బలోపేతం అవుతుందని తద్వారా ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగుతుందని ఆయన అన్నారు. ఐఏఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రక్షణ చట్టం చేయడం వలన ప్రభుత్వానికి అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉండదని ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా చట్టాన్ని తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఉందని ఆయన అన్నారు. రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి భాషా మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో భాగమైన న్యాయవాదులకు రక్షణ ఉన్నప్పుడే కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఏ ఎల్ రాయచోటి కమిటీ ఉపాధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శులు కే నాగేశ్వర్, నిరంజన్, వరలక్ష్మి, కిరణ్ కుమార్ రాయచోటి బార్ అసోసియేషన్ ట్రెజరర్ ఖుష్నుమా, స్పోర్ట్స్ సెక్రటరీ టీవీ రమణ, న్యాయవాదులు డి రామాంజనేయులు, ఎస్. హ్యూమయున్ భాష, డి.నాగ ముని, ఎం రవిశంకర్, రామచంద్ర, జగదీష్, ఇలియాస్, ఇర్షాద్, అజంతుల్లా, శివకుమార్ డి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మహానేత వైఎస్సార్ విగ్రహ ధ్వంసం హేయమైన చర్య

### పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 03:-** డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మరణం అనంతరం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి చేతుల మీదుగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ మండిపడ్డారు.జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలో పేద ప్రజల ప్రాణదాత,మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన పులివెందులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన అటువంటి మహానేత విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమన్నారు.దేవగుడి కుటుంబానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో మేలు చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఆరోగ్యశ్రీ పథకం ద్వారా లక్షలాది మంది పేదల ప్రాణాలను కాపాడిన ప్రాణదాత వైఎస్సార్ అని,అలాంటి నేత విగ్రహాన్ని పగలగొట్టడం దారుణమని కిషోర్ మండిపడ్డారు.ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే చట్టం ముందు నిలబెట్టి, ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని ఆయన స్థానిక యంత్రాంగాన్ని,పోలీసులను డిమాండ్ చేశారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174